వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



పేరెంట్స్ సమావేశానికి ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 25: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు నవంబరు 14న నిర్వహించే పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి కోన శశిధర్ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 16,347 మందితో మెగా డీఎస్సీ ప్రకటించిన విషయం తెలిసిందేనని, ఇందులో ఎక్కడా పొరపాట్లు జరగకుండా పటిష్టంగా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ రాయచోటి కలెక్టరేట్ నుంచి అధికారులతో మాట్లాడుతూ మార్గదర్శకాలను దృష్టిలో వుంచుకొని మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించేందుకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు జారీ చేయబోయే యూనిక్ ఐడీ నిమిత్తం కచ్చితమైనా డేటా రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం ఆదేశించిన మేరకు మెగా డీఎస్సీకి సంబంధించి రోస్టర్ కమిటీ ఏర్పాటుకు తగుచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియా దేవి, ఆర్డీఓ రంగస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 25: ప్రైవేటు విద్యాసంస్థల్లో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టు పిల్లలందరికీ ఫీజుల్లో రాయితీ కల్పిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టు పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పించిన ఆదేశాల పత్రాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లి శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది అక్రిడిటేషన్ కలిగిన పేద జర్నలిస్టులు వున్నారని, వారిని దృష్టిలో వుంచుకొని ఈ అవకాశాన్ని కల్పించామన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు కలెక్టర్‌కు, జాయింట్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గౌనిపల్లి శ్రీనివాసులు, క్రిష్ణయ్య, ఈశ్వర్, సాయిప్రతాప్‌రెడ్డి, రమేష్ రాజు, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఫ్రైడే-డ్రైడే పై అవగాహన కల్పించాలి


● డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డా.కొండయ్య అన్నారు. రాష్ట్ర ఎంటమాలజికల్ కన్సల్టెంట్ కొండారెడ్డి, జిల్లా మలేరియా అధికారి బి.వేణుగోపాల్, డీపీఎంవో డాక్టర్ రియాజ్ బేగ్, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి డీఎంహెచ్‌వో ఎస్టీ కాలనీలో దోమల లార్వా నివారణ కోసం చేపట్టిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాలనీలో నీటి నిల్వ ఉన్న డ్రమ్ములు, తొట్లు, కుండలు, కూలర్స్, ఫ్రిడ్జ్‌లు, రోళ్లు పరిశీలించి ప్రజలకు దోమల లార్వా నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం నీటి నిల్వ ఉన్న అన్ని వస్తువులు ఒక్క గంట ఆరబెట్టాలని సూచించారు. అనంతరం ఆశావర్కర్ల ద్వారా అబాట్ పిచికారీ చేశారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా జ్వరాల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమతెరలు వాడుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్-యూనిట్ అధికారి ప్రసాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



సిరులు కురిపిస్తున్న బొప్పాయి పీలింగ్
8
● టన్ను రూ.5 వేలు

ఆక్రమణలను మునక నుంచి కాపాడేందుకు చెక్‌డ్యాం పగలగొట్టిన వైనం



ఉపాధి గుంతలు పూడ్చి చిన్నపిరెడ్డికుంటలో ఆక్రమణలకు పాల్పడిన దృశ్యం





చెరువులను చెరబట్టారు

● కుంచించుకుపోతున్న రాతిచెరువు, చిన్నపిరెడ్డికుంట
● ఆక్రమించుకున్న వాళ్లకు ఆక్రమించుకున్నంత
● ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
● చర్యలు తీసుకుంటామని చేతులెత్తేశారు

గతంలో రాజులు ఉండేవారు.. రాజ్యాలు ఉండేవి అని పల్లెల్లో పెద్దవాళ్లు కథలు చెబుతుండేవారు. అదేవిధంగా ఇంకొన్ని సంవత్సరాలు పోతే.. మన ఊరి పక్కన చెరువులు ఉండేవి.. ఆ చెరువులు మా తాతల కాలంలో సుమారు వందల ఎకరాలకు సాగునీరు అందించేవి అని చెప్పుకోవాల్సిన పరిస్థితులు వచ్చేలా ఉన్నాయి. ప్రస్తుత ఆగడాలు చూస్తుంటే నిజమే అనిపిస్తోంది. చుట్టూ పచ్చని పొలాలు, తోటలతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న చెరువులు మరికొన్ని సంవత్సరాల తర్వాత ఉండకపోవచ్చు. చెరువులను మొత్తం చెరబట్టి.. అక్రమ కట్టడాలు చేపట్టారు. దీనికి తోడు పట్టాలు కూడా సృష్టించారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు ఉన్నారనే విమర్శలున్నాయి.

సుండుపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో పోచంవాండ్లపల్లె సమీపంలో రాతిచెరువు ఉంది. ఆ చెరువు సుమారు 68.70 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. అయితే రాను రానూ రాతిచెరువు కర్పూరంలా కరిగిపోతోందని చెరువు దిగువ భాగంలో ఉండే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు మా తాతలకు, ముత్తాతలకు అన్నం పెట్టింది.



ఆక్రమణలు ఆయకట్టుకు శాపం..

రాతి చెరువు ఆక్రమణలు చెరువు దిగువభాగంలో ఉండే రైతులకు శాపంగా మారింది. గతంలో చెరువుకింద రెండు కార్లు పంటలు పండేవి. ఇప్పుడు చెరువు నిండినా ఒక కారు పండించేందుకే కష్టంగా ఉంది. ఆక్రమణలు తొలగించి చెరువులో పూడికతీత పనులు చేయిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. చెరువు దిగువ భాగంలో నాకు భూములు ఉన్నాయి. ఆక్రమణలు వలన నష్టం జరుగుతోంది.

- చంద్రశేఖర్‌రాజు, రైతు, వెంగమరాజుగారిపల్లె

ప్రస్తుతం మాకు చెరువు నిండితే ఒక కారు పంటలు పండించుకుంటున్నాము. గతంలో రైతులు రెండు పంటలు పండించేవారు. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం తగ్గిపోతుంది. ఈ చెరువు దిగువ భాగంలో ఉన్న భూములకు సాగునీరు కొరత ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ పచ్చని పొలాలు, తోటలతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న చెరువు మరికొన్ని సంవత్సరాల తర్వాత ఉండకపోవచ్చని స్థానిక రైతులు చెబుతున్నారు. చెరువు చుట్టూ ఆక్రమించి మామిడి తోటలు, వరి పంటలు, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారు. కొంత మంది చెరువును కూడా డీకేటీ పట్టాలుగా మార్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బోర్లు వేసి మామిడి తోటలను సాగు చేస్తున్నారు. చెరువులోని మట్టిని తరలించి చెరువు చుట్టూ ఆక్రమణలకు వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ఇంత పెద్ద చెరువును ఆక్రమించి అక్రమ పట్టాలు సృష్టిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు, కూటమి నాయకులు సుండుపల్లె తహసీల్దార్ దైవాదీనంకు వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణల నుంచి చెరువును కాపాడాలని కోరారు.

ఉపాధి గుంతలు పూడ్చి మరీ ఆక్రమణ

మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీలోని జంగంపల్లి సమీపంలోని చిన్నిపిరెడ్డికుంట ఆక్రమణలకు గురవుతోంది. ఈ కుంట విస్తీర్ణం 32 ఎకరాలు ఉండేది. ఈ కుంట వర్షాలు బాగా పడి నిండితే కుంట దిగువ భాగంతో పాటు పరిసర ప్రాంతాల్లో బోర్లలో సాగునీటి కొరత ఉండేది కాదు. కుంటలో ఉపాధి పనులు చేసి మరింత నీరు నిల్వ ఉండేలా అధికారులు ప్రణాళికలు వేసుకుని ఉపాధి కూలీల చేత పనులు చేయించారు. కుంటలో ఫిష్ పాండు గుంతలు, కుంటలో మట్టిని గట్టుపైన వేయడం, కుంటలో, కుంట గట్టుపైన పిచ్చిమొక్కలను తొలగించడం వంటి పనులను చేయించారు. అయితే కుంట చుట్టూ భూములు కలిగిన వ్యక్తులు రాను రానూ కుంటను ఆక్రమిస్తున్నారు. సుమారు 13 ఎకరాల్లో ఆక్రమణలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆక్రమణలను తొలగించి కుంటను కాపాడాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఉపాధి పనుల ద్వారా చేయించిన గుంతలను సైతం పూర్తిగా జేసీబీలతో పనులు చేసి ఆక్రమణలు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు కాపాడాలని కోరారు.

కంచె చేను మేస్తోందా

ప్రభుత్వ స్థలాలను, చెరువులు, వాగులు, కుంటలను కాపాడాల్సిన అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రాతిచెరువు అని తెలిసినా కూడా డీకేటీ పట్టాలను మంజూరు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన రెవెన్యూ అధికారులే పట్టాలు ఇవ్వడం ఏమిటని కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు. సుండుపల్లె మండలంలో ఫిర్యాదులు చేసినా కూడా ఫలితం ఉండదని, ఫిర్యాదు చేస్తే కేవలం ఒక్కరోజు ప్రకటనగా మాత్రమే సంబంధిత అధికారులు చూస్తున్నారని చెబుతున్నారు. మండలంలోని అప్పన్నకుంట, రాయవరం గ్రామం జంగంపల్లి సమీపంలోని చిన్నిపిరెడ్డికుంట లాంటి ఎంతో ఉపయోకరమైన కుంటలను, రాతి చెరువు లాంటి రైతులకు అన్నం పెట్టి చెరువులు అన్యాక్రాంతం అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నారు. ఈ పరిస్థితి మారాలంటే మండలంలో ఆక్రమణలపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కూటమి నాయకులు చెబుతున్నారు.



రాతి చెరువు

చెరువుల ఆక్రమణలపై దృష్టి పెడతాం...

చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పలు చెరువులు, కుంటలు ఆక్రమణలు అవుతున్నట్లు కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. చెరువులను, గుంటలను ఆక్రమిస్తే ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. జంగంపల్లె సమీపంలోని చిన్నిపిరెడ్డి కుంటలో ఆక్రమణలు ఉన్నట్లు తెలిసింది. తమ సిబ్బంది పరిశీలించారు. అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం.

- దైవాదీనం, తహసీల్దారు, సుండుపల్లె



పీలేరు ఎల్‌బీఎస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ

నత్తే.. నయం..!

● పీలేరులో సా...గుతున్న ఆర్వోబీల నిర్మాణం
● ఆక్రమణలు, కోర్టు కేసులే కారణమంటున్న నిర్మాణ సంస్థ
● దుమ్ము, ధూళితో ప్రజలు సహజీవనం
● శ్వాసకోస వ్యాధులకు గురవుతున్న వైనం
● ట్రాఫిక్ సమస్యలతో నిత్యం సతమతం

పీలేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో ఆర్వోబీల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూ పట్టణ ప్రజలకు అటు చికాకులు, ఇటు ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. రెండేళ్ల కాలపరిమితితో 2023లో ప్రారంభమైన నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి బాలారిష్టాలు దాటలేక నిర్దేశిత గడువులోపు పూర్తవుతాయో లేదో తెలియని గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్దేశిత గడువులోపు నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూస్తామని ప్రభుత్వ అధికారులు చెబుతున్నా, పనులు జరుగుతున్న తీరు అలా కనిపించడం లేదు. ఆక్రమణలు, కోర్టు కేసుల కారణంగా తమ పరిస్థితి ఒక అడుగు ముందుకు, పది అడుగులు వెనక్కు అనేలా ఉందని ఆర్వోబీల నిర్మాణ సంస్థ ప్రతినిధులు వాపోతున్నారు. వీటి నిర్మాణాల వల్ల రేగుతున్న దుమ్ము, ధూళి, ట్రాఫిక్ సమస్యలతో సహజీవనం చేస్తున్న ప్రజలు మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించి ఆర్వోబీలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఆర్వోబీల పూర్తిపై అనుమానాలు

పీలేరు పట్టణం గుండా సాగుతున్న బళ్లారి-నాయుడుపేట, కర్నూలు-చెన్నై జాతీయ రహదారుల్లో రెండు చోట్ల రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయి. రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైళ్ల రాకపోకలకు అనువుగా తరచూ పడే గేట్ల కారణంగా రహదారి ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉండకూడదన్న లక్ష్యంతో జాతీయ రహదారుల సంస్థ రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్వోబీల నిర్మాణాలకు సిద్ధమైంది. అలా పీలేరు పట్టణంలో రెండు ఆర్వోబీలు అవసరమయ్యాయి. సుదీర్ఘ నిరీక్షణ, మంతనాల తరువాత కేంద్ర ప్రభుత్వం పీలేరు పట్టణానికి రెండు ఆర్వోబీలు మంజూరు చేసింది. పీలేరు-చిత్తూరు మార్గంలోని ఆర్వోబీని రూ.37.54 కోట్ల వ్యయంతో 2023 ఫిబ్రవరి, పీలేరు-మదనపల్లె మార్గంలో ఉన్న ఆర్వోబీని రూ.36.41 కోట్ల వ్యయంతో జూన్ 2023లో నిర్మాణ పనులు ప్రారంభించారు. రెండేళ్ల కాలపరిమితితో పనులు పూర్తవుతాయని అప్పట్లో అధికారులు ప్రకటించారు. రెండు ఆర్వోబీలను ఒకే నిర్మాణ సంస్థ దక్కించుకోవడంతో పనులు చకచకా జరుగుతాయని పట్టణ ప్రజలు ఆశించారు. అయితే వారి ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ ప్రారంభంలో పనులు వేగంగా చేసినప్పటికీ చిత్తూరు మార్గంలో కోర్టు కేసులు, మదనపల్లె మార్గంలో ఆక్రమణలు చికాకు పెట్టడంతో పనులు మందగించాయి. చిత్తూరు మార్గంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి రైల్వే క్రాసింగ్ వరకు వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ క్రాసింగ్ దాటిన తరువాత పిల్లర్ల దశ దాటడం లేదు. ఆ ప్రాంతంలోని కొంత మంది తమకు అందించిన పరిహారం సంతృప్తికరంగా లేదంటూ కోర్టును ఆశ్రయించడంతో పాటు ఆ ప్రాంతంలో పనులు ప్రారంభం కాలేదు. ఇక మదనపల్లె మార్గంలోని ఆర్వోబీ నిర్మాణానికి ఆ ప్రాంతంలోని గృహస్థుల ఆక్రమణలు నిర్మాణ పనులకు అటంకంగా మారాయి. దీంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. కాలపరిమితి ముగింపు దశకు చేరుకుంటున్నా నిర్మాణ పనులు ఆ గడువులోపు పూర్తయ్యేలా కనిపించడం లేదని చాలామంది నిర్మాణ రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. వీటిని సకాలంలో పూర్తి చేసి తమను బాధల నుంచి విముక్తుల్ని చేయాలని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

జూలై 2025 లోపు పూర్తి చేస్తాం..

ఆర్వోబీలను వచ్చే ఏడాది జూలై మాసం లోపు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు పర్యవేక్షిస్తున్నాం. కొన్ని సమస్యలు చికాకు పెడుతున్నా వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. నిర్మాణ సంస్థ ప్రతినిధులతో నిత్యం సమన్వయం చేసుకుంటూ వారికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి అటు రెవెన్యూ, ఇటు తమ శాఖ తరఫున సహకరిస్తున్నాం.

- నాగరాజు, డీఈ, ఎన్‌హెచ్

దుమ్ము, ధూళి, ట్రాఫిక్‌తో సతమతం

ఆర్వోబీల నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి పీలేరు పట్టణ ప్రజలు దుమ్ము, ధూళి, ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాఫిక్ నియంత్రణకు ఆర్వోబీలు ఉపయోగపడతాయని అనుకున్న ఆర్వోబీల కారణంగా వారిని ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టుతుండడంతో ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోంది. నిర్మాణ పనుల కారణంగా ధ్వంసమైన రోడ్డు నుంచి నిత్యం రేగుతున్న దుమ్ము కారణంగా పీలేరు-మదనపల్లె, పీలేరు-చిత్తూరు మార్గంలోని దుకాణాలు, ఇళ్లు దుమ్ముతో నిండిపోయి భయానకంగా తయారయ్యాయి. అందులో ఉంటున్న వారు శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నారు. దుమ్ము లేవకుండా నిత్యం నీటితో రోడ్డును తడపాల్సిన కాంట్రాక్టర్ ఆ పనిపై సరైన దృష్టి సారించకపోవడంతో దుమ్ము సమస్య ఉత్పన్నమవుతోంది. దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణంలో సాధారణ పరిస్థితుల్లోనే ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉంటాయి. ఆర్వోబీల నిర్మాణ పనుల కారణంగా కుంచించుకుపోయిన రోడ్ల కారణంగా ఆ సమస్యలు మరింత ఎక్కువయ్యాయి.



ఎల్‌బీఎస్ రోడ్డు వద్ద ఇరుకుగా ఉండటంతో ఇబ్బంది పడుతున్న వాహనాలు

ఇంట్లో అన్నం కూడా తినలేకున్నాం..



బ్రిడ్జి పనుల వల్ల వస్తున్న దుమ్ము వల్ల మా ఇంట్లో ప్రశాంతంగా అన్నం కూడా తిన లేకపోతున్నాం. పది నిమిషాలు ఇంటి ముందు నిలబడుకుంటే ఒళ్లంతా దుమ్ముతో నిండిపోతా ఉంది. అధికారులు బ్రిడ్జి పనులను ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మేలు చేసినవారవుతారు.

- మహబూబ్ బాషా, ఎల్‌బీఎస్ రోడ్డు





పీలేరు-చిత్తూరు మార్గంలో నిర్మితమవుతున్న అండర్ పాస్.. ఇరుకుగా మారిన రోడ్డు

దళిత మహిళను దగా చేసిన వలంటీర్

● పట్టా మార్చి ఇంటి స్థలం కాజేశాడు
● నిలదీసిన మహిళకు చంపుతామని బెదిరింపులు
● న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన వితంతు మహిళ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 25: భర్త చనిపోయి.. అయినవారు లేక.. ఇద్దరు పిల్లలతో బతుకీడుస్తున్న ఓ దళిత మహిళను వలంటీర్ దగా చేశాడు. మహిళ పేరుతో మంజూరైన ఇంటి పట్టాను మార్ఫింగ్ చేసి ఏకంగా ఆ స్థలంలో ఇంటినిర్మాణం చేసి మోసం చేశాడు. అక్రమ కట్టడాన్ని అడ్డుకోబోయిన దళిత మహిళను చంపుతామని, నీ బిడ్డలకు భవిష్యత్ లేకుండా చేస్తానని బెదిరించాడు. దీంతో చేసేది లేక శుక్రవారం మధ్యాహ్నం కురబలకోట మండలం, సర్కార్ తోపు గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న తనకు ఇచ్చిన స్థలం వద్ద తన బిడ్డలతో కలిసి నిరసన చేపట్టింది. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పింది. ఫిర్యాదులో వివరాలిలా...

తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలం, సర్కారుతోపులో కాపురం ఉండే దళితుడు వెంకటరమణ భార్య కమల (34)కు 2014లో ఆర్‌ఓసీ నెంబరు 351-2014లో అప్పటి కురబలకోట మండల తహసీల్దార్ ఇంటి పట్టాను మంజూరు చేశారు. ఈమె భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమె తన కుమారులు మోక్ష, వెంకటశివనాథ్‌తో కలిసి మదనపల్లె మండలం, అమ్మచెరువుమిట్టలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. దీనికి తోడు బిడ్డల సంరక్షణ కోసం కేరళ వెళ్లి భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తోంది. అయితే ఆ మహిళ ఇతర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ ఉండడంతో స్థలంలో బేస్‌మట్టం కట్టించేందుకు గానూ అదే గ్రామానికి చెందిన బండపల్లె కృష్ణారెడ్డి, అలియాస్ కృష్ణమూర్తి (వలంటీర్) అకౌంట్లో డబ్బులు వేసింది. దీంతో ఆయన ఇదే అదునుగా చూసుకొని వైసీపీ అండదండలతో ఆ స్థలంలో బేస్‌మట్టం వేసి ఇంటి నిర్మాణం చేశాడు. విషయం తెలుసుకున్న దళిత మహిళ తన స్థలంలో ఇంటి నిర్మాణం ఎలా చేపడతావని నిలదీయడంతో తనను, తన బిడ్డలను చంపేస్తానని బెదిరించినట్లు వాపోయింది. దీంతో చేసేది లేక అప్పట్లో మిన్నకుండిపోయింది. ప్రస్తుతం తనకు, తన పిల్లలకు ఏ దిక్కూ లేదని, కూటమి ప్రభుత్వంలోనైనా తనకు న్యాయం చేయాలని వేడుకొంది. దీనిపై కలెక్టర్ విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరింది. అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే తనకు, తనబిడ్డలకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేసింది.



తన స్థలం కబ్జా చేసి నిర్మించిన ఇంటి ముందు నిరసన తెలుపుతున్న దళిత మహిళ కమల

23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ఇద్దరు తమిళ కూలీలు అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో అటవీ అధికారులు

సిద్దవటం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఇద్దరు తమిళ కూలీలను అదుపులోకి తీసుకుని, 23 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి వివరించారు. శుక్రవారం సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొండూరు బీట్ నీలసరికోన ప్రాంతంలో కొంతమంది ఎర్రచందనం దుంగలు మోస్తూ కనబడడంతో వారిని చుట్టుముట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, ఎనిమిది మంది పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వారిని రంగస్వామి, భూపాలన్‌గా గుర్తించామన్నారు. పారిపోయిన వారిలో ఒకరు ఉమ్మడి కడప జిల్లా చాపాడు మండలానికి చెందిన జాకీర్ అని విచారణలో తేలిందన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం 569 కిలోలుండగా, రూ.1,58,035 విలువ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎర్రచందనాన్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించి, నిందితులను తిరుపతి కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సురేష్, ఎఫ్‌బీవోలు విశ్వనాథ్‌రెడ్డి, దీపిక, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



భూమి పూజ చేసి ప్రారంభిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ములకలచెరువులో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నవంబరు 6, 7 తేదీల్లో జరగనున్నాయి. ఈ పోటీలకు బాలురు, బాలికల విభాగంలో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. ఈ పోటీలకు గానూ ములకలచెరువులోని ఇండెన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో ఉన్న మైదానాన్ని ఎంపిక చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మైదానాన్ని రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేసేందుకు చదును చేసే పనుల ప్రారంభం కోసం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి, మదనపల్లె డీవైఈవో పురుషోత్తం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత భూమి పూజ చేశారు. బాలురు, బాలికల విభాగంతో మొదటి, రెండవ స్థానంలో నిలిచిన జిల్లా జట్లకు రూ.3లక్షలు నగదు ప్రోత్సాహకం అందిస్తానని జయచంద్రారెడ్డి ప్రకటించారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, పీడీలు, పీఈటీల అభ్యర్థన మేరకు పోటీల్లో పాల్గొనే ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులకు, సిబ్బందికి భోజన, వసతి, మెమెంటోలు, స్టేజి ఏర్పాటు, మైదానం చదునుకు అయ్యే ఖర్చు భరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరమణ, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం క్రిష్టారెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

నందలూరు, అక్టోబరు 25: స్కూలగేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జీ ఎఫ్ క్యారమ్స్ అండర్-14, 17 విభాగాల్లో నంద లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తేజకృష్ణ, పెంచలయ్య, నరసింహ, స్వర్ణలత, వెంకట స్నేహ, మల్లికార్జున, మాలశ్రీ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు షేక్ రౌఫ్‌బాషా తెలిపారు. ఇటీవల బయనపల్లి, చింత కొమ్మదిన్నెలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో ఉమ్మడి కడపజిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన 7వ తరగతి విద్యార్థి నాగచైతన్య కూడా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

రైల్వేకోడూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని కే.బుడుగుంటపల్లె దళితవాడకు చెందిన వెంకటేష్ (24) తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం విపరీతంగా కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

రాజంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై హైవేరోడ్డులోని ఊటుకూరు మలుపు వద్ద శుక్రవారం ఆగి ఉన్న స్కూటర్‌ను లారీ ఢీకొనడంతో పాటు స్కూటర్‌పై ఉన్న విక్రమ్ ఎడమ కాలుపైనుంచి వెళ్లింది. దీంతో అతని ఎడమకాలు శరీరం నుంచి విడిపోయింది. వెంటనే రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరులు కురిపిస్తున్న బొప్పాయి పీలింగ్

బొప్పాయి పీలింగ్ రైతులకు సిరులు కురిపిస్తోంది. బొప్పాయి కాయల దబ్బలే టన్ను సుమారు రూ.5 వేలు ధర పలుకుతుండడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాల్లోని ఫ్యాక్టరీలకు కూడా సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరు, ఓబులవారి పల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల నుంచి వారానికి 20 లారీల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేయడంతో పాటు.. స్థానికులకు జీవనోపాధి కల్పిస్తున్నారు.

టన్ను రూ.5 వేలు ● ఇతర రాష్ట్రాలకు సరఫరా ● పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వ్యాపారుల డిమాండ్

రైల్వే కోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి కాపు వచ్చిన తర్వాత ముందస్తుగా రైతుల నుంచి పీలింగ్ చేసే యజమానులు రైతుల దగ్గర నుంచి కాయలను కొనుగోలు చేసుకుంటారు. తోటలో రెండు నుంచి మూడుసార్లు కోతలు జరిగిన తర్వాత మధ్యస్తంగా ఉన్న కాయలను పీలింగ్ వ్యాపారులకు రైతులు విక్రయిస్తారు. రైతుల నుంచి కొన్న కాయలను పీలింగ్ కేంద్రాల్లోకి తెచ్చి యంత్రాలతో పైతాట తీసి కట్ చేస్తారు. కట్‌చేసిన కాయల దబ్బలను రెండు నుంచి మూడు రోజుల పాటు పెద్ద, పెద్ద తొట్లలో ఉప్పులో నానబెడతారు. ఆ నానబెట్టిన దబ్బలను లారీల్లో కర్ణాటక, తమిళనాడు, కోల్‌కతా, కేరళ, మహారాష్ట్ర నగరాలలో ఉన్న పరిశ్రమలకు తరలిస్తారు. టూటీఫ్రూటీ పరిశ్రమల్లో బొప్పాయి దబ్బలను చిన్న, చిన్న ముక్కలుగా తయారు చేసి వాటిని వివిధ రంగుల్లో ముక్కలను తయారు చేస్తారు. ముక్కల్లో స్వీట్ కలుపుతారు. దాని ద్వారా కమ్మని చెర్రీస్‌గా తయారు చేస్తారు. వీటిని బ్రెడ్డు, ఐస్‌క్రీములు తదితర వాటిల్లో ప్రధానంగా ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువగా రుచిగా ఉండడంతో డిమాండ్ బాగా ఉంటుంది.

ఉప్పులో నానబెట్టిన కాయ దబ్బలు టన్ను సుమారు రూ.5 వేలు ధర పలుకుతోంది. కోడూరు నుంచి ఉప్పులో నానబెట్టిన దబ్బలను రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల నుంచి వారానికి 20 లారీల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేస్తారు. అంటే సుమారు 100 టన్నులు బొప్పాయి దబ్బలు ఎగుమతి అవుతున్నాయని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. కోడూరు పట్టణంలో సుమారు 10 చిన్నతరహా పరిశ్రమలున్నాయి. ఇవి కూడా పెద్ద సాంకేతిక పరిజ్ఞానం కలిగినవి కాదని వ్యాపారులు అంటున్నారు. ఒకే యంత్రంపై ఆధారపడి కాయల పైన ఉన్న తాటను తీసి వేసేంత వరకే ఉపయోగపడుతున్నాయి. సాంకేతికపరంగా పెద్ద, పెద్ద యంత్రాలు ఉంటే గంట పని.. పది నిమిషాలకు అయిపోతుంది. రైల్వేకోడూరు, ఓబులవారి పల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు తదితర ప్రాంతాల్లో తోటల్లో కోతలు అయిపోయే స్థితిలో పీలింగ్‌కు రైతులు అమ్ముకుంటారు. ప్రతి ఏటా కొన్ని వేల టన్నుల కాయలను రైతుల దగ్గర నుంచి కాయలను పీలింగ్ యజమానులు తీసుకుంటారు.



బొప్పాయి కాయలను యంత్రంలో వేసి తాట తీస్తున్న దృశ్యం

వెయ్యి మందికి పైగా ఉపాధి

బొప్పాయి పీలింగ్ ద్వారా సుమారు 1000 మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. కోడూరు మండలంలో సుమారు 25 సంవత్సరాల నుంచి చిన్న పరిశ్రమలు మైసూరివారిపల్లె, జంగిటివారిపల్లె, కోడూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులకు లాభసాటిగా మారింది. చాలామంది యువకులు ఈ పరిశ్రమలు పెట్టుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. చిన్న పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించి రుణాలను మంజూరు చేస్తే బొప్పాయి పీలింగ్ పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

అధునాతన యంత్రాలు కావాలి

- ప్రసాద్, జంగిటివారిపల్లె, వ్యాపారి



అధునాతన సాంకేతిక బొప్పాయి పీలింగ్ యంత్రాలు కావాలి. ప్రస్తుతం ఉన్న యంత్రాలతోనే పీలింగ్ చేస్తున్నాము. ఉప్పులో నానబెట్టిన దబ్బ లను ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేస్తున్నాము. టన్ను రూ.5 వేలు పలుకుతోంది. టూటీఫ్రూటీ పరి శ్రమలు రైల్వేకోడూరులో పెడితే ఖర్చు పూర్తి స్థాయిలో తగ్గిపోతాయి.

పరిశ్రమలను స్థాపించాలి

- బ్రహ్మయ్య, రైల్వేకోడూరు, బొప్పాయి రైతు



రైల్వేకోడూరులో చిన్న తరహా పరిశ్రమలను స్థాపించాలి. దీంతో చాలా మందికి జీవనోపాధి కలుగుతుంది. రైతులు బొప్పాయి సాగు చేపట్టి దిగుబడులు వచ్చిన తర్వాత కాయ లను రెండు నుంచి మూడుసార్లు కోతలు జరిగిన తర్వాత మధ్యస్తంగా ఉన్న కాయలను పీలింగ్ వ్యాపారులకు విక్రయిస్తారు.



పీలింగ్ కేంద్రానికి తరలించిన బొప్పాయి కాయలు



పెద్ద తొట్టిలో ఉప్పులో నానబెట్టిన బొప్పాయి దబ్బలు



బొప్పాయితో తయారు చేసిన చెర్రీస్

'గజగజ' వణుకుతున్న పీలేరు!

పీలేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏనుగుల సంచార సమాచారంతో పీలేరు శుక్రవారం గజగజ వణికిపోయింది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు, రామిరెడ్డిగారిపల్లె ప్రాంతాల్లో తిష్టవేసిన ఏనుగులు మళ్లీ పీలేరు వైపు వస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆ గ్రామాలకు పొరుగున్న పీలేరు మండలం ఎర్రగుంటపల్లె, అగ్రహారం పంచాయతీ ప్రజలు భయంతో వణికిపోయారు. ఈ నెల 15న ఏనుగుల దాడిలో పీలేరు మండలం కాకులారంపల్లెకు చెందిన రైతు చిన్న రాజారెడ్డి చనిపోయిన విషయం తెలిసిందే. అప్పటి వరకు ఏనుగుల ఊసు తెలియని పీలేరు మండల ప్రజలకు వాటి భయం పట్టుకుంది. 15వ తేదీన రాత్రి ఏనుగులను పీలేరు ప్రాంతం నుంచి కల్లూరు ఘాటులోకి అటవీ అధికారులు విజయవంతంగా తరిమేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం ఆ ఏనుగుల గుంపు పులిచెర్ల వైపు రావడం, అక్కడి రైతులు, అటవీ శాఖాధికారులు వాటిని మళ్లీ అటవీ ప్రాంతంలోకి తరిమే క్రమంలో అవి దారి తప్పి పీలేరు వైపు రావడం జరిగింది. ఈ విషయాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పీలేరు ప్రజలు హడలెత్తిపోయారు. అవి మళ్లీ తమ ప్రాంతాల్లోకి ఎక్కడ వచ్చేస్తేయోనని పులిచెర్ల మండల సరిహద్దు గ్రామాలైన అగ్రహారం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లె, ఎనుములవారిపల్లె భయంతో గడిపారు. అయితే ఏనుగుల సంచారం గురించి తెలుసుకున్న పీలేరు, మదనపల్లె బీట్ అటవీ సిబ్బంది గురువారం రాత్రి నుంచి అవి పీలేరు వైపు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చుతూ రాత్రంతా పులిచెర్ల-పీలేరు సరిహద్దు గ్రామాల్లో గడిపారు. దీంతో శుక్రవారం అవి పీలేరు మండలంలో ప్రవేశించలేకపోయాయి. ఒకసారి వచ్చినవి మళ్లీ మళ్లీ వస్తాయన్న భయంతో ఏనుగుల సంచారంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసు కొట్టివేత

రాయచోటిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కేసును రుజువు చేయడంలో పోలీసులు విఫలమయ్యారంటూ రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి శుక్రవారం ఓ హత్య కేసును కొట్టివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ పెద్దగొల్లపల్లెకు చెందిన బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ, బుట్టిమాని చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్య ముగ్గురూ ప్రాణస్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి మెలిసి తిరిగేవారు. ఈ క్రమంలో చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన ఎర్రయ్యకు 2019 నవంబరులో భూతగాదాలు ఏర్పడ్డాయి. ఈ విషయంలో ఎర్రగొల్లి ఎర్రయ్యకు మద్దతు తెలిపాడన్న కారణంతో బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ కలిసి 2019, నవంబరు 7న చిన్నప్ప సోదరుడు తిమ్మయ్యను హత్య చేశారని సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును రుజువు చేయడంలో పోలీసులు విఫలమయ్యా రని రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి కేసును కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుల తరపున న్యాయవాది టి.ఈశ్వర్‌రెడ్డి, పి.రెడ్డయ్యలు వాదించారు.

మరమ్మతు పనులతో...

బిరాబిరా కదులుతున్న పింఛా జలాలు



సప్లై ఛానెల్‌లో పనులు చేస్తున్న కూలీలు

పీలేరు, అక్టోబరు 25: ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సప్లై ఛానెల్‌కు అధికారులు, టీడీపీ నాయకులు చేపట్టిన మరమ్మతు పనులు సత్ఫలితాలు అందిస్తున్నాయి. మరమ్మతుల కారణంగా అడ్డంకులు తొలగడంతో పింఛా జలాలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకువైపు బిరాబిరా కదులుతున్నాయి. సమ్మర్ స్టోరేజ్ కంటే ముందు ఉన్న కాకులారంపల్లె పంచాయతీ ఎర్రదొడ్డిపల్లె చెరువులోకి గురువారం సాయంత్రం పింఛా జలాలు చేరుకోవడంతో అటు పీలేరు వాసులు, ఇటు కాకులారంపల్లె పంచాయతీ వాసుల్లో ఆశలు చిగురించాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పింఛా నది నుంచి సప్లై ఛానెల్ ఉన్నప్పటికీ కాంక్రీటు కట్టడం కాకపోవడంతో కాలక్రమంలో అది బలహీన పడింది. దీంతో నీటి ప్రవాహంపై అనుమా నాలు ఏర్పడ్డాయి. ఈ విషయం కాకులారంపల్లె నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే సప్లై ఛానెల్‌కు మరమ్మతులు యుద్ధప్రాతి పదికన చేపట్టాలని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో ఆయన వ్యక్తిగత కార్యదర్శి సత్య, అధికారులు, నాయకులతో సమన్వయం చేసుకుని ఈ నెల 22న మరమ్మతులు ప్రారంభించారు. పింఛా నది నుంచి నీటిని సప్లై ఛానెల్‌కు అనుసంధానం చేసే స్థలం నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వరకు మరమ్మతులు పనులు పూర్తి చేశారు. దీంతో ఛానెల్‌లో నీటి ప్రవాహం ఆరంభమైంది. అయితే విపరీతంగా పెరిగిపోయిన జమ్ము, పొదలు, చెట్ల కొమ్మలు ప్రవాహానికి అడ్డుపడుతుండడంతో శుక్రవారం ఉదయం కూలీలను రంగంలోకి దింపి వాటిని తొలగించే పనులు చేపట్టారు. దీంతో ఛానెల్‌లో ప్రవాహ వేగం పెరిగింది. ప్రస్తుతం పింఛా జలాలతో ఎర్రదొడ్డిపల్లె చెరువు పాక్షికంగా నిండింది. మరో రెండు రోజుల్లో అది నిండిపోతుందని, ఆ తరువాత సమ్మర్ స్టోరేజ్‌కు జలాలు పరుగులు పెడతాయని యల్లెల రెడ్డప్పరెడ్డి తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఒకసారి నిండితే మూడేళ్ల పాటు పీలేరు పట్టణంతో పాటు కాకులారంపల్లె ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి!

● స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ

గాలివీడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ విజ్ఞప్తి చేశారు. గాలివీడు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ నిర్వహణపై శుక్రవారం ఆయన సమీక్షించారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు వేల అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఈ సంఖ్య మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ రూ.200ల అపరాధ రుసుముతో ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, రూ.500ల అపరాధ రుసుముతో ఈ నెల 30, 31 తేదీలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అర్హులైన వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గాలివీడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గేశ్వర రాజు, మొహిద్దిన్ బాషా, కో-ఆర్డినేటర్ నాగరాజు, మహేశ్వరయ్య, మధుమతి, శివానంద్, శివారెడ్డి, రమణయ్య, వెంకటయ్య, నిర్మలా దేవి, ఫైరోజ్, షబానా, సుబ్బారాయుడు, మధుమతి, శివానాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన విగ్రహాలు రికవరీ - ఇరువురి అరెస్టు

రాజంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చోరీకి గురైన విగ్రహాలు రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మన్నూరు పోలీసు స్టేషన్‌లో సీఐ రామాంజనేయులుతో కలసి ఆయన వివరాలు వెల్లడించారు. రాజంపేట మండలం పోలిచెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోని ఆంజనేయ, లక్ష్మీదేవి, వినాయక విగ్రహాలు ఈనెల 17న చోరీ అయ్యాయన్నారు. ఈ కేసులో దర్యాప్తు చేసిన పోలీసులు సయ్యద్ మస్తాన్‌బాషా, షేక్ మస్తాన్ కలీంను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక అడుగు ఎత్తు గల ఇత్తడి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, అర్థడుగు లక్ష్మీదేవి విగ్రహం, అర్థడుగు ఇత్తడి వినాయక విగ్రహాలతోపాటు, రూ 8 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చెక్కు చెదరని అపూర్వ కట్టడం

- 200 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం
- కడపకు తలమానికంగా పాత కలెక్టరేట్
- మ్యూజియంగా మారిస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగం



కడప కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెక్కు చెదరని అపూర్వ కట్టడంగా కడప నగర నడిబొడ్డున గల పాత కలెక్టరేట్ నేటికీ దర్శనమిస్తోంది. నాటి బ్రిటీష్ తెల్లదొరల హయాంలో గత 1808 సంవత్సర కాలంలో ఈ భవన నిర్మాణం చేసినట్లు తెలుస్తోంది. 200 ఏళ్ల నాటి నిర్మాణం కావడంతో కడపకు తలమానికంగా చెప్పవచ్చు.

నగర ఏడురోడ్ల కూడలికి దగ్గరగా నిర్మించిన పాత కలెక్టరేట్ పూర్తిగా రాయి, గచ్చు, ఇటుక, ఉక్కు, రంగూన్ టేకుతో అప్పట్లో చాలా కట్టుదిట్టంగా నిర్మించడంతో ఇప్పటికీ ఆ భవనం హుందాతనంతో కళాత్మకంగా చూపరులను ఆకట్టుకుంటోంది. భవనానికి ప్రధాన ద్వారం ఉత్తర దిక్కున ఏర్పాటు గావించారు. కింద నుంచి పై అంతస్తుకు వెళ్లేందుకు వీలుగా నాలుగు దిక్కుల గుండా మెట్ల మార్గాలున్నాయి. ఒక్కో మెట్ల మార్గంలో ఏడు మలుపులతో వుంటూ ఆ లెక్కన ప్రతీ మలుపులో ఐదేసి మెట్లు వున్నాయి. పూర్తిగా భవనం పైభాగానికి వెళ్లాలంటే ఆగ్నేయం మూలలో గల మెట్ల మార్గం గుండా వెళ్లాలి. స్వాతంత్ర్యానికి పూర్వం కడప మొట్టమొదటి కలెక్టర్‌గా సర్ థామస్ మన్రో, ద్వితీయ కలెక్టర్‌గా డబ్ల్యూ డబ్ల్యూ చాప్లిన్, తృతీయ కలెక్టర్‌గా జి.గ్రెగరి సేవలందించారు. కాగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత (1947) మొట్టమొదటి కలెక్టర్‌గా ఆర్.ఎస్.మలయప్పన్, ద్వితీయ కలెక్టర్‌గా డబ్ల్యూ.హెచ్. మిచ్చెల్, తృతీయ కలెక్టర్‌గా టి.ప్రభాకరరావు నాయుడు సేవలందించారు.

ఇదిలా వుండగా భవనానికి పడమర వైపు పోర్టికో, ఉత్తరం వైపున ట్రెజరీ గార్డ్స్ వుండేవి. ఇందులో కోనేరు రంగారావు కమిటీ (కెఆర్ఆర్) డిప్యూటీ కలెక్టర్ చాంబర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ క్యాంప్ క్లర్క్ గది, అలాగే రెండవ జాయింట్ కలెక్టర్ చాంబర్, కలెక్టర్ క్యాంప్ క్లర్క్ గది, కలెక్టర్ చాంబర్, జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లు కూడా వుండేవి. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైడ్ నెట్‌వర్క్ (ఏపీ స్వాన్ గది) కాగా అందులో వున్న ఓ పెద్ద గదిలో ఎ-సెక్షన్, బి-సెక్షన్, సి-సెక్షన్, డి-సెక్షన్, ఇ-సెక్షన్, ఎఫ్- సెక్షన్, జి-సెక్షన్, డిస్పాచింగ్ విభాగాలు, సోషల్ వెల్ఫేర్ ల్యాండ్ ఆక్విజిషన్ (ఎస్.డబ్ల్యూ.ఎల్.ఏ) సిబ్బంది వుండేవారు. హాలుకు ఉత్తరం వైపు గ్రంథాలయం వుండేది. కాలగమనంలో 2008 ఆగస్టు 11 నుంచి గ్రంథాలయం స్థానంలో మినీ కాన్ఫరెన్స్ హాలు ఏర్పాటైంది. వీటితో పాటుగా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ చాంబర్ వుండేది. జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని ట్రెజరీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంగా ఒకప్పుడు పిలిచేవారు. లోపలి వైపు స్ట్రాంగ్ రూమ్ వుండేది. ఏదేమైనా కడపకు తలమానికంగా నిలిచిన పాత కలెక్టరేట్ 2016 ఏప్రిల్ వరకూ ప్రజలకు సేవలందించింది.

మ్యూజియంగా మారిస్తే బాగుంటుంది

నగర ఆర్ట్స్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన కొత్త కలెక్టరేట్ భవన సముదాయం నుంచి ప్రజాసేవలు ప్రారంభమైనప్పటి నుంచి పాత కలెక్టరేట్ భవనం కళావిహీనంగా దర్శనమిస్తోంది. భవనం చుట్టూ పరిసరాలు చెత్తా, చెదారం, మట్టితో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పాలకులు, జిల్లా అధికారులు కాసింత దూర దృష్టి సారించి ఆ భవనాన్ని మ్యూజియంగా మారిస్తే భవిష్యత్ తరాలకు గొప్ప ప్రాచీన సంపద అందించినట్లు అవుతుందని పలువురు జిల్లావాసులు కోరుతున్నారు.

వలపు వల.. చిక్కారో విలవిల

- వీడియో కాల్‌లో అందమైన స్త్రీలు మాట్లాడతారు
- ముఖం కనబడితే చాలు.. మార్ఫింగ్ చేస్తారు
- నగ్న వీడియోలు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తారు
- డబ్బులు పంపకపోతే.. బెదిరింపులకు దిగుతారు
- వలపు వలలో చిక్కుకుంటున్న బాధితులు
- లక్షల్లో డబ్బులు సమర్పించుకుంటున్న వైనం



కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మోసపోయేవారున్నంత వరకూ మోసం చేసేవారు తయారవుతూనే ఉంటారు. ఇప్పుడు సైబర్ మోసాలు ఎక్కువ అవుతున్నాయి. నేరగాళ్లు ఇతరులను టార్గెట్ చేసుకుంటూ వారి జేబులు నింపుకుంటున్నారు. ఒకరి ఆశ, ఇంకొందరి ఆత్యాశను క్యాష్ చేసుకోవడానికి వలపు వల విసురుతున్నారు. చదువు రానోళ్లే కాదు.. వీరి ఉచ్చులో విద్యార్థులు, ఉన్నత విద్య చదివినోళ్లు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

కొత్త నెంబర్ల నుంచి వీడియోకాల్ చేస్తారు. అనుకోకుండా ఏదైనా ముఖ్యమైన కాల్ ఏమో అని ఎత్తామా ఇక అంతే సంగతులు. అవతల అందమైన స్త్రీ నగ్నంగా ఉండి మాట్లాడుతుంది. ఆ కాల్ ఎత్తి మన ముఖం చూపిస్తే చాలు.. అటువైపు ఆమె, ఇటు పక్క బాధితుడు స్ర్కీన్ మీద కనిపిస్తున్న వీడియోను రికార్డు చేస్తారు. ఆ కాల్ కట్ చేసి మన ఫేస్‌ను మార్ఫింగ్ చేసి అశ్లీల పద్ధతిలో వీడియోలు తయారు చేసి మనకే పంపిస్తారు. ఇక బెదిరింపులు మొదలుపెడతారు. నగ్న వీడియోను కుటుంబ సభ్యులకు పంపుతామని, తెలిసిన వారుంటే ఆయా గ్రూపుల్లో షేర్ చేస్తామని బెదిరిస్తారు. తరువాత మనకు కాల్ చేసి డబ్బు ఇవ్వకుంటే ఆ వీడియోలు నీ గ్రూపుతో పాటు ఇతర సోషల్ మీడియాలో మీకు కాంటాక్ట్ ఉన్న ప్రతి ఒక్కరికీ పంపిస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగుతారు. దీంతో బాధితులు బయటికి చెప్పుకోలేక తమ పరిస్థితి ఇతరులకు చెబితే చిన్నచూపు చూస్తారేమోననే ఉద్దేశ్యంతో వారు అడిగిన డబ్బులు ఇస్తున్నారు. ఇలా సైబర్ నేరగాళ్లు రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. పోలీసులు ఒక పక్క అవగాహన కల్పిస్తున్నా.. కొత్త కొత్త విధానాలతో సైబర్ కేటుగాళ్లు తెగబడుతు న్నారు. జిల్లాలో ఇలాంటి సైబర్ నేరాలు చోటు చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

వాట్సప్‌లో కొత్త నెంబర్ల వీడియో కాల్స్ ఎత్తకండి



మీ కాంటాక్ట్స్‌లో లేకుండా ఉండి, గుర్తు తెలియని నెంబరు నుంచి వాట్సప్ వీడియో కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దు. ఒకవేళ ఎత్తాల్సి వస్తే మొబైల్‌లో ఫ్రంట్ కెమెరాను వేలితో మూసి లిఫ్ట్ చేయాలి. దీంతో మనం స్ర్కీన్‌లో కనిపించం. దీంతో అవతల వాళ్లు రికార్డు చేసే అవకాశం ఉండదు. ఎవరైనా మోసపోతే గంట వ్యవధిలో 1930కి కాల్ చేసి వివరాలు తెలపాలి. అపరిచిత కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్, కడప

కడప జిల్లాకు చెందిన విశ్రాంత అధికారి వీరి ఉచ్చులో పడి దాదా పు రూ.8లక్షలు పోగొట్టుకున్నారు. ఓ పెద్ద ఉద్యోగి కూడా దాదాపు రూ.6లక్షల వరకు పోగొట్టుకున్నట్లు సమాచారం. దాదాపు 15 మంది వరకు సైబర్ నేరగాళ్ల వలలో పడి లక్షల్లో పోగొట్టుకుని చివరికి పోలీసులను ఆశ్రయించారు.

లింకులు క్లిక్ చేస్తే ఊడ్చేస్తారు

ఉచిత డేటా, ఐఫోన్ అంటూ ఊరించే సందేశాలు ఇప్పుడు సర్వసాధారణ మయ్యాయి. ఏ మాత్రం ఆశ పడి క్లిక్ చేసినా బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మంతా ఊడ్చేస్తారు. ఇక్కడ ఎవరూ ఏది ఉచితంగా ఇవ్వరనే విషయాన్ని గ్రహించాలి. ప్రజల మానసిక బలహీనతలతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. లక్షకు పైగా సంపాదించవచ్చు, రోజుల వ్యవధిలో పెట్టుబడి రెట్టింపు అవుతుంది లాంటి ప్రకటనలు ఊరిస్తున్నాయని, వీటిని నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

దోమల నియంత్రణకు పాటుపడాలి

- జిల్లా మలేరియా అధికారి మనోరమ



వాటర్ డ్రమ్ములను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మనోరమ

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించి దోమల నియంత్రణకు పాటుపడాలని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ అన్నారు. శుక్రవారం నగరంలోని అగాడి వీధిలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వీధిలోని పలు ప్రాంతాలను పరిశీలించి స్థానికులకు తగు సూచనలు చేశారు. వారానికి ఒక సారైన ఇళ్లలోని తొట్లు, బానలు, కుండలను శుభ్రం చేసి ఆరబెట్టాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ జ్వరాల నుంచి తప్పించుకోవాలంటే పరిశుభ్రతతో పాటు దోమల నియంత్రణకు రాత్రి నిద్రించు సమయంలో దోమలు కుట్టకుండా తప్పకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసరు డాక్టర్ శ్రావణి, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సీహెచ్ఓ చిన్న పుల్లయ్య, సబ్‌యూనిట్ ఆఫీసరు నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లాలో పక్కాగా పశుగణన ప్రారంభం



పశుగణనను ప్రారభిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి జాతీయ పశుగణన ప్రారంభమైంది. ముందుగా జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ అదితి సింగ్, కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డిల నివాసాలకు జిల్లా పశు వైద్యాధికారిణి శారదమ్మ తన సర్వే సిబ్బందితో కలసి వెళ్లి 21వ పశుగణన సర్వేను ప్రారంభించారు. పశుగణన సర్వే ప్రక్రి యలో భాగంగా జిల్లా పశు వైద్యాధికారులు, పశుగణన కోసం నియమించిన శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందితో ఈనెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన నిర్వహించనున్నారు. జిల్లాలో 2019లో జరిగిన గణన ప్రకారం జిల్లాలో ఆవులు, ఎద్దులు 44,656, గేదెలు 3,99,910, గొర్రెలు 9,83,684 మేకలు 3,62,582, పందులు 2,777, కోళ్లు 1,95,152 ఉన్నాయి. ప్రస్తుతం చేపట్టిన పశుగణాంకాలతో ఈ లెక్కలు పక్కాగా తేలనున్నాయి. అంతేకాకుండా గుర్రాలు, ఒంటెలు కలుపుకొని 16 రకాల పశుసంపదను ఈ గణనలో సర్వే సిబ్బంది లెక్కలు కట్టి యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌రెడ్డి, డీడీ డాక్టర్ రంగస్వామి, ఏడీ డాక్టర్ శ్రీధర్, లింగారెడ్డి, ఎన్యుమరేటర్స్ మాహన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు 12వేల క్యూసెక్కుల కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వా యిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాల్వ ద్వారా గండికోట ప్రాజెక్టుకు 12 వేల క్యూసెక్కులు కృష్ణాజలాలు వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే 6వేలు వస్తుం డగా మరో 6 వేలు శుక్రవారం నుంచి వస్తున్నాయన్నారు. దీంతో మైలవరం జలాశయానికి శుక్రవారం రాత్రి 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు తెలిపారు. అదే విధంగా మెయిన్ కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులు తున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ప్రతిభ



ప్రతిభచూపిన విద్యార్థి సువర్ణను అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త

వేంపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సువర్ణ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈనెల 14 నుంచి 18 వరకు గోవాలో జరిగిన 33వ నేషనల్ బెంచ్ ప్రెస్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సువర్ణ కాంస్యపతకం సాధించింది. డైరెక్టర్ కుమారస్వామి గుప్త శుక్రవారం ఆ విద్యార్థినిని అభినందించారు. కోచ్ తివారి శిక్షణలో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు ఓబయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ గోడౌన్‌ల తనిఖీలు



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న డీఎన్‌సీసీ అధికారులు

కడప (క్రైం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ)ఆధ్వర్యంలో శనివారం కడప జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ కార్యాలయాలు, గోడౌన్‌లలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయాలపై ప్రజలు సహకరించి సమాచారం అందించాలని డీఎన్‌సీసీ అధికారులు కోరారు.

మెడికల్ స్టోర్లను తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



మెడికల్ స్టోర్లలో రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్తు మందులతో యువత చిత్తు అవుతోందని ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగకిరణ్ ఆధ్వర్యంలో కడప డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి, రాయచోటి ఇన్‌స్పెక్టర్ జయరాముడులు శుక్రవారం నగరంలోని పలు మెడికల్ షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మత్తు కల్గించే మందుల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను వారు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన రెండు షాపులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఈ తనిఖీలో పోలీసులు కూడా పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా మరింత నైపుణ్యం



ఎఫ్3 కార్ పనితీరును వివరిస్తున్న ట్రైనర్ రాహుల్‌రంజన్

పులివెందుల రూరల్, అక్టోబరు 25: శిక్షణ ద్వారా మరింత నైపుణ్యతను పెంపొందించుకోవచ్చని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ అరుణకాంతి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో యంత్ర- 2కె 24 జాతీయ సదస్సును రెండవ రోజైన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంకే ఇండస్ర్టీస్ ట్రైనర్ రాహుల్ రంజన్ ఎఫ్3 కార్ డిజైన్, పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు రామేశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు చంద్రశేఖర్, రాజేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు సేవ చేయడం అభినందనీయం



యోగివేమన పశువైద్య విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలతను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు పశువైద్యులు సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో మూగజీవాలకు సేవ చేయడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. మూగజీవాలపై ప్రేమతోనే పశువైద్య కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కళాశాల ఏర్పాటుకు చేసిన కృషిని, కష్టాన్ని గుర్తు చేసుకుని ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు. కళాశాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు, నివారణ చర్యలు, తక్కువ ఖర్చుతో సమీకృత దానా తయారీ వంటి అంశాల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజాకిశోర్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో ఎనిమిది టెక్నికల్ సెషన్స్ జరిగాయన్నారు. అలాగే 16 లీడ్ పేపర్స్‌ను ప్రజంట్ చేశారని, 181 పరిశోధన పత్రాలను శాస్త్రవేత్తలు ప్రజంట్ చేశారన్నారు. అనంతరం ఉత్తమ పరిశోధన ఫలాలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ సీఈఓ ఎం.శ్రీనివాసరావు, పశువైద్య విశ్వవిద్యాలయం అధ్యాపకులు, పశువైద్య కళాశాల వైద్యులు, ఎస్‌జీఎస్‌బీటీ అధ్యక్షుడు డాక్టర్ థాని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి





మృతులు సిద్దారెడ్డి, మన్సూర్

సికెదిన్నె, అక్టోబరు 25: మండల పరిధిలోని ఊటుకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొన్నోలు చిన్నసిద్దారెడ్డి (52), షేక్ మన్సూర్ (20) మృతి చెందారు. సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన పొన్నోలు చిన్నసిద్దారెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈయన గురువారం రాత్రి ఊటుకూరు నుంచి కడపకు వెళ్లేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలోని ఓ లాడ్జి వద్దకు రాగానే కడప నుంచి బైకులో మన్సూర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సిద్దారెడ్డి గురువారం రాత్రి, మన్సూర్ శుక్రవారం మృతి చెందారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఇరువురు మృతితో ఊటుకూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఊటుకూరు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పొన్నోలు సుబ్బిరెడ్డి తమ్ముడు చిన్నసిద్దారెడ్డి కావడంతో వారి కుటుంబాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబానికి పార్టీ అన్ని విధా లా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రమాదవశాత్తు బుగ్గవంకడ్యాంలో పడి విద్యార్థి మృతి

సికెదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక డ్యాంలో గాలి ప్రేమ్ కుమార్(17) అనే విద్యార్థి గల్లంతై మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం బుగ్గవంక డ్యాంను చూడటానికి ప్రేమ్‌కుమార్, తన నలుగురు మిత్రులతో కలిసి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. వారి స్నేహితులు ఎవరికి ఈత రాకపోవడంతో ఇంటికి వెళ్లి బంధువులకు తెలపడంతో వారు సికెదిన్నె పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కాగా ప్రేమ్‌కుమార్ శ్రీహరి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నముక్కపల్లె వద్ద నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి సంబంధించి వివరాలు లేవు. ఎవరైనా ఇతన్ని గుర్తిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై వ్యక్తికి తీవ్ర గాయాలు



పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు హరిజనవాడలో వేంపల్లె వరపుత్రుడు అనే వ్యక్తి ఇంటిలో గ్యాస్ సిలిండర్ లీకేజీ అయ్యింది. దీంతో మంటలు రావడంతో ఇంట్లో ఉన్న వరపుత్రుడుకు తీవ్ర గాయాలయ్యాయి. శరీరం కాలడంతో నందిమండలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనలో కడప రిమ్స్‌కు తరలించారు.

స్థానిక అవసరాలకు ఇసుక ఉచితం

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను స్థానికుల అవసరాల కోసం వాగులు, వంకలు నుంచి ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల నుంచి తీసుకెళ్లవచ్చని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని రాష్ట్ర గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాజధాని అమరావతి నుంచి ఇసుక పాలసీ అమలు తీరుతెన్నులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, గనులశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్టరీ మాట్లాడుతూ ఇసుక పాలసీలో ఇసుక అవసరం ఉన్న ప్రతి వినియోగదారుడు పారదర్శకంగా ఇసుక తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక తీసుకొనేటపుడు సీనరేజ్ ఫీజును పూర్తిగా మాఫీ చేయడం జరిగిందన్నారు. ఇసుక రీచ్‌లు అందుబాటులో లేని ప్రజలకు ఆ ప్రాంత అవసరాలకు సరిపడే ఇసుక అందించే క్రమంలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వాణిజ్యపరంగా ఉచిత ఇసుక విక్రయిస్తే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు. వీసీ ముగిసిన అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక డంప్‌ల నుంచి ఇసుకను రాత్రల్లో తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో గనులశాఖ డీడీ సూర్య చంద్రరావు, గ్రౌండ్‌వాటర్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్ర అయిన పొలతల దేవస్థానానికి శివపార్వతులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చల్లని దొర, తహసీల్దార్ అనురాధలు తెలిపారు. పొలతలలోని టూరిజం భవనంలో శుక్రవారం మండలస్థాయి అధికారులతో కార్తీక మాస ఉత్సవాలపై అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం క్యూలైన్లు, పార్కింగ్ తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణానాయక్, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధికి రూ.5.55 లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న అరవింద స్కూలు యాజమాన్యం

ప్రొద్దుటూరు అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదలతో తీవ్రంగా నష్టపోయిందని.. చంద్రబాబు కృషితో అక్కడ ప్రజలకు మెరుగైన పరిస్థితులు కల్పించారని.. అలాంటి ముఖ్యమంత్రికి అండగా నిలబడటానికి సహాయనిధి కింద రూ.5,55,555 అందజేస్తున్నట్లు అరవింద ఇంటిగ్రల్ స్కూలు కరస్పాండెంట్ వంకదార వీరభద్రయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎంఆర్‌కాలనీలోని అరవింద స్కూలులో ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి అందజేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీఎం సహాయ నిధికి రూ.5.5లక్షల విరాళం ఇవ్వడంపై ఆయన అభినందించారు. కార్యక్రమంలో కాశీపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



WANTED

A.P. Govt. Reg. పొందిన Riyaz Promotions నందు పనిచేయుటకు 10th, ఇంటర్, డిప్లమా P/F అయిన 25 సంగలోపు యువతీ యువకులు కావలెను. సంపాదన : నెలకు 13000 to 25000, రూం+భోజనం ఫ్రీ, సెల్: 79893 89001 Ajc-196228

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్ : 90105 01122. Ajc-202142

బంగారం కొనబడును

మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్,ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్)గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647 AJA- 198452

CHANGE OF NAME

I, KOSURI SUKANYA (Old name), residing at H.No. 2/269-A, Mahaboob nagar, Rajampet Town & Mdl. Annamayya Dt, A.P., hereby changed my name as LINGAMGUNTLA SUKANYA D/o LINGAMGUNTLA VENKATESHWARLU, (New name), For all Future Purposes. AJC-000

అద్దె/లీజ్

కడప టౌన్ చిన్నచౌక్, అంజనేయస్వామి గుడి ఎదురుగా, మెయిన్‌రోడ్‌లో North ఫేసింగ్ కమర్షియల్ /రెసిడెన్షియల్ 10 సెంట్ల స్థలములో ఇల్లు పార్కింగ్ ఫెసిలిటి కలదు. Poly Clinic/Offices/ Commercial ప్రాముఖ్యత 9640565942, 8885668830 Ajc-196227

డాక్యుమెంట్స్ పోయినవి

కాంబల్లె మనోహర్ తండ్రి(Late) కాంబల్లె సుబ్బరాయుడు, D.No. 12/123-3, ఎస్.బి.ఐ. కాలనీ, కడప. నాకు సర్వ హక్కులు కలిగిన కడప మండలం, రామరాజుపల్లి గ్రామపంచాయతీ సదరు గ్రామ పొలం, గజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని సర్వే నెంబర్114, య.13.18 పైకి య.0.15 సెంట్లు ఈపైకి య.0.7 1/2 సెంట్లుగల జాగాకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఐటిఐ సర్కిల్‌లోని జిరాక్స్ సెంటర్ వద్ద పోయినవి. దొరికిన వారు సెల్: 78939 95807 నెంబర్‌కు తెలుపగలరు. Ajc-000

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం 9985411183 9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రభుత్వం మారినా.. తగ్గని స్వామి భక్తి

● ప్రభుత్వ కార్యాలయాలపై తొలగని జగన్ చిత్రాలు, పేర్లు

సుండుపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల అధికారులు స్వామి భక్తి ప్రదర్శించారు. వైసీపీ నాయకులు చెప్పిందే వేదంగా పనిచేశారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, పాలడైరీలు వైసీపీ నాయకులకు అడ్డాగా మారింది. గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో కూర్చొని వైసీపీ నాయకులు, కార్యకర్తలు నడిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు పూర్తిఅయినా ఇప్పటి వరకు మండంలోని పొలిమేర పల్లె గ్రామ పంచాయతీ నగరిలోగతంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి, పాల ఉత్పత్తి కేంద్రాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోలు, పేర్లు పెద్ద పెద్ద అక్షరాలతో దర్శనమిస్తున్నాయి. గతంలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలకు కూటమి ప్రభుత్వంలో పేర్లు మార్చి ప్రజలకు సేవలు అందిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలపై పేర్లు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ అధికారులు జగన్‌పై స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారని కూటమి నాయకులు మండిపడు తున్నారు. నిత్యం పలు రకాల అవసరాలపై అధికారులు వచ్చే కార్యాలయాలపై పేరు మార్చకపోవడంతో హాస్యాస్పదంగా ఉందని కూటమి నాయకులు చెబుతున్నారు. బుధవారం ఉదయం 11 గంటలు అయినా రైతు సేవా కేంద్రాలు రైతులకు సేవ చేసేందుకు ఉన్నాయనే విషయాన్ని అధికారులు మరిచిపయారా.. లేదా వైసీపీ పాలనలోనే ఉన్నా మనే యోచనలో ఉన్నారా అని రైతులు, స్థానికులు చెబుతున్నారు.



రైతు భరోసా కేంద్రంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చిత్రం



పాల ఉత్పత్తి కేంద్రంపై పెద్ద పెద్ద అక్షరాలతో జగనన్న పేరు

పథకాల రూపకల్పనకు పశుగణన కీలకం

రాజంపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించే పథకాలకు పశుగణన ద్వారా సేకరించిన సమాచారం చాలా కీలకమని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.గుణశేఖరపిళ్లై తెలిపారు. మండలంలోని కూచివారిపల్లెలో శుక్రవారం పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నట్టల నివారణ మందులు వేస్తామన్నారు. . అనంతరం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో డివిజనల్ పశువైద్యులకు, సిబ్బందితో మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా పశువైద్య సిబ్బంది అందరూ గ్రామాలకువెళ్లి పశువుల వివరాలు సేకరించాల న్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు ఎస్.సురేష్‌రాజు, సహాయ సంచాలకులు ప్రతాప్, భాగ్యవతి, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: సుండుపల్లెలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.విజయకుమార్ పశుగణన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్యూమరేటర్లు విధిగా తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి పశుసంపదను లెక్కించాలన్నారు. సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై

రూ.2 కోట్లతో మైసూరివారిపల్లి అభివృద్ధి

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లి పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో డ్రైనే జీ సీసీ రోడ్లు, పలు అభి వృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైసూరివారిపల్లి పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, సర్పంచ్ కారుమంచి సంయుక్త జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా

మంత్రి జోక్యంతో తొలగిన రోడ్డు ఆక్రమణ

సంబేపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జోక్యంతో దారి ఆక్రమణ సమస్య తొలగినట్లు కొండవాండ్లపల్లె బీసీ కాలనీ గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. కాలనీలోని రోడ్డు 40 ఏళ్లుగా ఆక్రమణకు గురైందన్న విషయం మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించారు. ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా మంత్రి, ఆయన సోదరుడికి ధన్యవాదాలు తెలియజేశారు. వారు చేసిన మేలును ఎప్పటికీ మరిచిపోలేమని గ్రామస్తులు తెలియజేశారు.

ప్రభుత్వ సంస్థలపై విద్యార్థులకు అవగాహన

పుల్లంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంస్థలు ప్రజలకు ఏవిధంగా సేవ చేస్తాయనే అంశంపై దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మనకు ఎవరు సేవ చేస్తారు అనే పాఠ్యాంశంలో భాగంగా ఉపాధ్యాయుడు రమణ 4, 5 తరగతుల విద్యార్థులను ఎంపీడీవో, తహసీల్దారు , ఎంఈవో కార్యాలయాలు, పోలీసుస్టేషన్, స్త్రీశక్తి భవన్, గ్రంథాలయం. బ్యాంకులు, పోస్టాఫీసు, ప్రభుత్వ వైద్యశాల, సచివాలయానికి తీసుకువెళ్లి అక్కడ పనులను ఎలా నిర్వహిస్తారో తెలియజేశారు.



పుల్లంపేట పోలీసుస్టేషన్ వద్ద విద్యార్థులతో పోలీసులు

మంత్రి నాదెండ్లను కలిసిన టీడీపీ నేతలు

రాజంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డీలర్‌షిప్‌ల పెంపుతో ఎదురయ్యే ఇబ్బందులను రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విన్నవించారు. శుక్రవారం అమరావతిలోని మంత్రి చాంబర్‌లో ఆయనను కలిశారు. రాజంపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో ఏర్పడిన ఇబ్బందులపై చర్చించారు. డీలర్లకు అడ్డంకులు ఎదురవు తుండడంతో సమస్య పరిష్కరించలేక పోతున్నామని, మంత్రి వారికి తెలిపారు. రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కొండా శ్రీనివాసులు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎన్వీ రమణ, మండల మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లునాయుడు, నాగేశ్వర్ నాయుడు, రాయచోటి నాయకులు రాజశేఖర్, అత్తిరాల దేవస్థానం మాజీ చైర్మన్ బండారు బాలయ్య, జనసేన నాయకులు రామా శ్రీనివాసులు, అబ్బిగారి గోపాల్, అగ్రహారం టీడీపీ నాయకులు సుధాకర్, వెంకటరాజంపేట నాయకులు ఉద్దండం సుధాకర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నాందెడ్ల మనోహర్‌తో టీడీపీ నాయకులు

బొగ్గుడివారిపల్లెలో పారిశుధ్య చర్యలు

సిద్దవటం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొగ్గుడివారిపల్లె గ్రామ పంచాయతి నిర్మలగిరి కాలనీ మహిళలు కొండు రమణమ్మ, అనురాధ, సుబ్బమ్మ అనే మహిళలు నీళ్ల విరేచనాలతో గురువారం మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షలు నిమిత్తం వెళ్లారు. వైద్యాధికారి డాక్టర్ శివశంకర్ పర్యవేక్షణలతో చికిత్స చేసినా విరేచనాలు తగ్గకపోవడంతో అప్రమత్తమైన వైద్యసిబ్బంది శుక్రవారం నిర్మలగిరి కాలనీలో ప్రతి ఇల్లు తిరిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ నిర్మలగిరి కాలనీలో ఎవరికి ఎటువంటి జ్వరాలు లేవని విరేచనాలతో కొంతమంది మహిళలు వైద్య పరీక్షలకు వచ్చారని గ్రామంలో అపరిశుభ్రత ఉన్న ప్రాంతాలను పూర్తిగా తొలగించామని ఇక్కడున్న మంచి ఇంటిని శాంపిల్ తీసుకున్నామని, ఇంటి పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలని, ప్రతిఒక్కరికి విరే చనాలు తగ్గేంతవరకు వైద్యశిబిరం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

రూపే కార్డు తీసుకుని ప్రమాద బీమా పొందండి

వీరబల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రూపే కార్డు తీసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఏపీజీబీ మేనేజర్ మనోహర్ తెలిపారు. వంగిమల్ల పంచాయతీ పెద్దహరిజనవాడకు చెందిన కె.గంగులయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన తమ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన పథకంలో సంవత్సరానికి రూ.436లు ప్రీమియం చెల్లించారు. దీంతో ఆయన భార్య అనితకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

తహసీల్దారు కోసం రైతుల పడిగాపులు

● మొక్కుబడిగా రెవెన్యూ గ్రామ సభ

సుండుపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం నిర్దేశించిన గ్రామసభలు సుండుపల్లె తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. మం డలంలోని భాగంపల్లెలో శుక్రవారం జరిగిన గ్రామసభలో అధికారుల కోసం రైతులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఉదయం 11.30 గంటలకు కూడా తహసీల్దారు దైవాదీనం గ్రామసభకు హాజరుకాలేదు. మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, గ్రామ రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, గ్రామ సర్వేయర్లు కీర్తన, యోగానందరెడ్డి, జగదీశ్ రెడ్డి హాజరు కాగా, రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి వెళితే 'సారొస్తాడు, ఉండండి' అంటూ కూర్చోబెట్టా రు. సుమారు 12 గంటలకు గ్రామసభకు వచ్చిన త హసీల్దారు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. గ్రామ సభలో గంట సమయం కూడా ఆయన లేరని రై తులు ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే గ్రామ సభ లని, సమస్యలు పరిష్కరించేది ఎవరని వారు అసహనం వ్యక్తం చేశారు.

సిద్దవటం : పరిహారం అందుకున్నా తమ భూముల వివరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారని ఉద్దిమడుగు నిర్వాసితులు తహసీల్దారుకు విన్నవించారు. మండలంలోని పెద్దపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దారుతో రైతులు మాట్లాడుతూ. ఆన్‌లైన్ నుంచి తమ భూముల వివరాలు తొలగించడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, గ్రామ సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్‌నాయుడు, ఉపసర్పంచ్ నాగ నరసింహారెడ్డి, వీఆర్వో శ్యాంబాబు, రెవెన్యూ సిబ్బంది, మందపల్లి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులు హాజరు కాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

దివ్యాంగులకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మానసకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించడంతోపాటు , రెండు ఎకరాల బంజరు భూమిని పంపిణీ చేసి, బోర్లు వేయించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పర్సంటేజ్ తో సంబంధం లేకుండా కాళ్లు లేని వారికి స్కూటర్లను మంజూరు చేయాలని కోరారు. వడ్డీ లేకుండా రూ. 2 లక్షలు రుణం ఇవ్వాలన్నారు. ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రిలో 50 శాతం రాయితీ కల్పించాలని తెలిపారు. దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోడూరు మండల ప్రభుత్వ ఆస్పత్రిలోనే సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. శెట్టిపల్లె పెంచలయ్య, పాలతోటి ప్రకాష్, ఇంద్రమ్మ, వికలాంగుల నాయకులు శ్రీను, అరుణ, మాధవి, దేవి పాల్గొన్నారు.



డిప్యూటీతహసీల్దార్ మానసకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బకాయిలను వెంటనే చెల్లించాలి

పుల్లంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రెసి డెంట్ బి.నరేంద్రనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీలో శుక్రవారం ఎస్టీయూ నాయకులు సమావేశమయ్యారు. పీఆర్సీ ప్రకటన ఆలస్యం కానున్న దృష్ట్యా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. సయ్యద్ హుస్సేన్, సిద్దయ్య, శివరాంప్రసాద్, వాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. . రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్ బాబు కథనం మేరకు బయనపల్లెకు చెందిన కట్టా వంశీకృష్ణకు వెంకటేశ్ అనే వ్యక్తితో పాతకక్షలున్నాయి. దీంతో గురువారం రాత్రి పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద ఉన్న వెంకటేష్ ఇంటి వద్దకు వచ్చి అతనితో ఘర్షణ పడ్డారు. దీంతో వెంకటేష్ కత్తితో దాడి చేయడంతో వంశీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చే స్తున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థికి ..

గాలివీడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు కొట్టడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. విద్యార్థుల కథనం మేరకు గాలివీడు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రైటింగ్ ప్యాడ్‌తో కొట్టడంతో లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి రేహాన్‌కు గాయమైంది. అతనికి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా నాలుగు కుట్లు పడ్డాయి. అయితే అలాంటిదేమీ లేదని, విద్యార్థుల తోపులాటలో స్వల్ప గాయాలయ్యాయని ప్రధానోపాధ్యాయులు చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా సెప్టెంబరు 15వ తేదీన ఇదే పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థిని చితకబాదిన ఉదంతం తెలిసిందే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా విద్యాశాఖాధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ఓబులవారిపల్లె,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి అనుకూల వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంసీఏ బుల్లయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో మంచి దిగుబడి సాధించేందుకు సకాలంలో ఎరువులు అందించాలని సూచించారు. బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగేంద్ర, రైతు విజయ్‌కుమార్‌నాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హేమసుందర్

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విశ్వ మానవ హక్కుల పరిషత్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రామలక్ష్మమ్మ విశ్వ మానవ హక్కుల పరిషత్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు అంకిఎల్లి శివకుమార్, జిల్లా మహిళా ఇన్‌చార్జ్ కటికం సునీత తదితరులు పాల్గొన్నారు.





సమస్యల పరిష్కారానికి ఏపీఎండీసీ ఎండీ హామీ

ఓబులవారిపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఏపీఎండీసీ ఎండీ హామీ ఇచ్చినట్లు ఏపీఎండీసీ ఔట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట యూనియన్ జనరల్ సెక్రటరి రేకులకుంట వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన విజయవాడ డీఎంజీ కార్యాలయంలో ఆయనను కలిసి కార్మిక సమస్యలను విన్నవించారు. ముగ్గురాయి దొంగలను పట్టించిన ముగ్గురు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు బహుమతి ఇవ్వకపోగా ఉద్యోగం నుంచి తొలగించారని, పోలీసు ఎంక్వైరీ చేయించి నిర్దోషులు అని తేలిన తర్వాత కొత్తగా ఉద్యోగంలో చేర్చుకున్నారని, వీరికి 6 నెలల 10 రోజులు కాలానికి జీతం చెల్లించాలని కోరగా విచారణ చేయించి న్యాయం చేస్తామని ఎండీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోరాట యూనియన్ నాయకులు పి.ఈశ్వరయ్య, వి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

సిద్దవటం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నీటిచుక్కను ఒడిసి పట్టుకునేందుకు వీలుగా ప్రతి ఒక్కరు ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఏపీవో నరసింహులు తెలియజేశారు. సిద్దవటం ఉపాధిహామీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ పథకం కింద వెయ్యి ఇంకుడు గుంతలు మంజూరు అయ్యాయని, ఉపాధి జాబ్‌కార్డు ఉన్నవారు అర్హులని, సమీప గ్రామ సచివాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీకార్యదర్శిని సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ఇసుక మంజూరు చేయండి

సిద్దవటం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చని ముఖ్యమంత్రి ఆదేశించి నా సిద్దవటం మండలం లో అమలు కాలేదని కొం తమంది కార్మికులు శుక్రవా రం మండల తహసీల్దారు మురాద్వావలీకి పెద్దపల్లి గ్రా మ సచివాలయ రెవెన్యూ గ్రామసభలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ఉచిత ఇసుక పాలసీపై మాకు ఎటువంటి ఆదేశాలు రాలేదని, మైనింగ్‌శాఖ నుంచి పూర్తి వివరాలు తీసుకుని ఉచిత ఇసుక పాలసీపై వివరాలు తెలియ జేస్తామని అన్నారు.

హిందూ ధర్మంపై అవగాహన కల్పించాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 25:(ఆంధ్రజ్యోతి) హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకునిపోవాలని విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు దరిశా వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. ప్రతి పల్లెలోను హిందూసనాతన ధర్మాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజల్లో హిందూ ధర్మాన్ని బలోపేతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో భజనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు పులపత్తూరి రామసుబ్బారెడ్డి, వీహెచ్‌పీ ప్రతినిధులు కనిగెల్పు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భుజంగేశ్వరాలయంలో 27న ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రైల్వేకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక భు జంగేశ్వరాలయంలో ఈ నెల 27న తన సొంత నిధులతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయను న్నట్లు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మందల ప్రవీణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారా యణరెడ్డి, రాష్ట్ర క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పీవీ. మిధున్‌రెడ్డి, రైల్వేకోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్, శాసనసమండలి సభ్యులు చెన్నంశెట్టి రామచంద్రయ్య, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, దేవదాయ శాఖ కమిష నర్ ఎస్. సత్యనారాయణ, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, కర్నూలు ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్, జిల్లా దేవదాయ శాఖ అధికారి సీ. విశ్వనాథ్, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తదితరులను ఆహ్వానించినట్లు తెలిపారు.

వేమన పద్య పోటీల కరపత్రాలు విడుదల

నందలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి వేమన జయంతి సందర్భంగా నిర్వహించే వేమన పద్య పోటీలకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కడప రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు నాగిరెడ్డి, కోశాధికారి ఆదినారాయణరెడ్డి, సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, తెలుగు పండితులు గంగసపల్లి వెంకటరమణ తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 10న ఆదివారం ఉదయం రాజంపేట బాలికోన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నామని, 15 ఏళ్ల లోపు విద్యార్థులు కరపత్రంలో పేర్కొన్న 12 పద్యాలను వరుస క్రమంలో చెప్పాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణతో ఈ నెలాఖరులోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు భోజన సదుపాయం ఉంటుందని రెడ్డిసేవా సమితి ప్రతి నిధులు తెలిపారు.

ప్రతిభా పురస్కారం పంపిణీ

రైల్వేకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గణేష్ అనే విద్యార్థికి మండలంలోని వీపీఆర్ కండ్రిక ప్రభుత్వ హైస్కూలులో శుక్రవారం నేత్రా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చాపల నేతాజీ రూ. 12000లు నగదు బహుమతి అందజేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మధుసూదన్‌రాజు, ప్రసాద్, చాపల విజయమ్మ, సంపత్‌కుమార్, అమరయ్య, కోట కొండల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పీవీజీపల్లె విద్యార్థిని

పుల్లంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పీవీజీపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.దివ్య రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ చంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం రాయచోటిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 కబడ్డీ సెలక్షన్‌లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

రాజంపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో శనివారం నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సామాన్య ప్రజలతో మమేకమై ముమ్మరంగా సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు

రైల్వేకోడూరు: నియోజకవర్గంలో శనివారం నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ రైల్వే కోడూరు ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు.

చెరువు ఆక్రమణదారులకు నోటీసులు

ఒంటిమిట్ట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువుకు ఆనుకుని నిర్మించిన గృహాల యజమానులకు శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. ఆయా స్థలాలకు సంబంధించిన ఆధారాలతో రెవెన్యూ అధికారులను సంప్రదించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, అలాంటి వారికి నోటీసులు జారీ చేయడం ఏమిటని స్థానికులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పుల్లంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏరియా కోఆర్డినేటర్ మల్లికార్జున సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం సమాఖ్య ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో నిర్వహించిన లావాదేవీలను పరిశీలించి ఈ ఏడాది చేప ట్టాల్సిన కార్యక్రమాలు, ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అనూష, దివ్య, ఏపీఎం వెంకట సుబ్బమ్మ, సీసీలు రుద్రాచారి, వెంకటసుబ్బయ్య, అనిత పాల్గొన్నారు.

23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ఇద్దరు తమిళ కూలీలు అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో అటవీ అధికారులు

సిద్దవటం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఇద్దరు తమిళ కూలీలను అదుపులోకి తీసుకుని, 23 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి వివరించారు. శుక్రవారం సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొండూరు బీట్ నీలసరికోన ప్రాంతంలో కొంతమంది ఎర్రచందనం దుంగలు మోస్తూ కనబడడంతో వారిని చుట్టుముట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, ఎనిమిది మంది పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వారిని రంగస్వామి, భూపాలన్‌గా గుర్తించామన్నారు. పారిపోయిన వారిలో ఒకరు ఉమ్మడి కడప జిల్లా చాపాడు మండలానికి చెందిన జాకీర్ అని విచారణలో తేలిందన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం 569 కిలోలుండగా, రూ.1,58,035 విలువ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎర్రచందనాన్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించి, నిందితులను తిరుపతి కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సురేష్, ఎఫ్‌బీవోలు విశ్వనాథ్‌రెడ్డి, దీపిక, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



భూమి పూజ చేసి ప్రారంభిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ములకల చెరువులో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నవంబరు 6, 7 తేదీల్లో జరగనున్నాయి. ఈ పోటీలకు బాలురు, బాలికల విభాగంలో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. ఈ పోటీలకు గానూ ములకల చెరువులోని ఇండెన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో ఉన్న మైదానాన్ని ఎంపిక చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మైదానాన్ని రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేసేందుకు చదును చేసే పనుల ప్రారంభం కోసం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి, మదనపల్లె డీవైఈవో పురుషోత్తం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత భూమి పూజ చేశారు. బాలురు, బాలికల విభాగంతో మొదటి, రెండవ స్థానంలో నిలిచిన జిల్లా జట్లకు రూ.3లక్షలు నగదు ప్రోత్సాహకం అందిస్తానని జయచంద్రారెడ్డి ప్రకటించారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, పీడీలు, పీఈటీల అభ్యర్థన మేరకు పోటీల్లో పాల్గొనే ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులకు, సిబ్బందికి భోజన, వసతి, మెమొంటోలు, స్టేజి ఏర్పాటు, మైదానం చదునుకు అయ్యే ఖర్చు భరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరమణ, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం క్రిష్టారెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

నందలూరు, అక్టోబరు 25: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జీ ఎఫ్ క్యారమ్స్ అండర్-14, 17 విభాగాల్లో నంద లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తేజకృష్ణ, పెంచలయ్య, నరసింహ, స్వర్ణలత, వెంకట స్నేహ, మల్లికార్జున, మాలశ్రీ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయుడు షేక్ రౌఫ్‌బాషా తెలిపారు. ఇటీవల బయనపల్లి, చింత కొమ్మదిన్నెలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో ఉమ్మడి కడపజిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన 7వ తరగతి విద్యార్థి నాగచైతన్య కూడా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

రైల్వేకోడూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువ కుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని కే.బుడుగుంటపల్లె దళితవాడకు చెందిన వెంకటేష్ (24) తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. శుక్ర వారం ఉదయం విపరీతంగా కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

రాజంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై హైవేరోడ్డులోని ఊటు కూరు మలుపు వద్ద శుక్రవారం ఆగి ఉన్న స్కూటర్‌ను లారీ ఢీకొనడంతో పాటు స్కూటర్‌పై ఉన్న విక్రమ్ ఎడమ కాలుపైనుంచి వెళ్లింది. దీంతో అతని ఎడమకాలు శరీరం నుంచి విడిపోయింది. వెంటనే రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరులు కురిపిస్తున్న బొప్పాయి పీలింగ్

బొప్పాయి పీలింగ్ రైతులకు సిరులు కురిపిస్తోంది. బొప్పాయి కాయల దబ్బలే టన్ను సుమారు రూ.5 వేలు ధర పలుకు తుండడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాల్లోని ఫ్యాక్టరీలకు కూడా సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరు, ఓబులవారి పల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల నుంచి వారానికి 20 లారీల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేయడంతో పాటు.. స్థానికులకు జీవనోపాధి కల్పిస్తు న్నారు.

టన్ను రూ.5 వేలు ● ఇతర రాష్ట్రాలకు సరఫరా ● పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వ్యాపారుల డిమాండ్

రైల్వేకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి కాపు వచ్చిన తర్వాత ముందస్తుగా రైతుల నుంచి పీలింగ్ చేసే యజమానులు రైతుల దగ్గర నుంచి కాయలను కొనుగోలు చేసుకుంటారు. తోటలో రెండు నుంచి మూడుసార్లు కోతలు జరిగిన తర్వాత మధ్యస్తంగా ఉన్న కాయలను పీలింగ్ వ్యాపారులకు రైతులు విక్రయిస్తారు. రైతుల నుంచి కొన్న కాయలను పీలింగ్ కేంద్రాల్లోకి తెచ్చి యంత్రాలతో పైతాట తీసి కట్ చేస్తారు. కట్‌చేసిన కాయల దబ్బలను రెండు నుంచి మూడు రోజుల పాటు పెద్ద, పెద్ద తొట్లలో ఉప్పులో నానబెడతారు. ఆ నానబెట్టిన దబ్బలను లారీల్లో కర్ణాటక, తమిళనాడు, కోల్‌కతా, కేరళ, మహారాష్ట్ర నగరాలలో ఉన్న పరిశ్రమలకు తరలిస్తారు. టూటీఫ్రూటీ పరిశ్రమల్లో బొప్పాయి దబ్బలను చిన్న, చిన్న ముక్కలుగా తయారు చేసి వాటిని వివిధ రంగుల్లో ముక్కలను తయారు చేస్తారు. ముక్కల్లో స్వీట్ కలుపుతారు. దాని ద్వారా కమ్మని చెర్రీస్‌గా తయారు చేస్తారు. వీటిని బ్రెడ్డు, ఐస్‌క్రీములు తదితర వాటిల్లో ప్రధానంగా ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువగా రుచిగా ఉండడంతో డిమాండ్ బాగా ఉంటుంది.

ఉప్పులో నానబెట్టిన కాయ దబ్బలు టన్ను సుమారు రూ.5 వేలు ధర పలుకుతోంది. కోడూరు నుంచి ఉప్పులో నానబెట్టిన దబ్బలను రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల నుంచి వారానికి 20 లారీల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేస్తారు. అంటే సుమారు 100 టన్నులు బొప్పాయి దబ్బలు ఎగుమతి అవుతున్నాయని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. కోడూరు పట్టణంలో సుమారు 10 చిన్నతరహా పరిశ్రమలున్నాయి. ఇవి కూడా పెద్ద సాంకేతిక పరిజ్ఞానం కల్గినవి కాదని వ్యాపారులు అంటున్నారు. ఒకే యంత్రంపై ఆధారపడి కాయల పైన ఉన్న తాటను తీసి వేసేంత వరకే ఉపయోగపడుతున్నాయి. సాంకేతికపరంగా పెద్ద, పెద్ద యంత్రాలు ఉంటే గంట పని.. పది నిమిషాలకు అయిపోతుంది. రైల్వేకోడూరు, ఓబులవారి పల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు తదితర ప్రాంతాల్లో తోటల్లో కోతలు అయిపోయే స్థితిలో పీలింగ్‌కు రైతులు అమ్ముకుంటారు. ప్రతి ఏటా కొన్ని వేల టన్నుల కాయలను రైతుల దగ్గర నుంచి కాయలను పీలింగ్ యజమానులు తీసుకుంటారు.



బొప్పాయి కాయలను యంత్రంలో వేసి తాట తీస్తున్న దృశ్యం

వెయ్యి మందికి పైగా ఉపాధి

బొప్పాయి పీలింగ్ ద్వారా సుమారు 1000 మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. కోడూరు మండలంలో సుమారు 25 సంవత్సరాల నుంచి చిన్న పరిశ్రమలు మైసూరివారిపల్లె, జంగిటివారిపల్లె, కోడూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులకు లాభసాటిగా మారింది. చాలామంది యువకులు ఈ పరిశ్రమలు పెట్టుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. చిన్న పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించి రుణాలను మంజూరు చేస్తే బొప్పాయి పీలింగ్ పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

అధునాతన యంత్రాలు కావాలి

- ప్రసాద్, జంగిటివారిపల్లె, వ్యాపారి



అధునాతన సాంకేతిక బొప్పాయి పీలింగ్ యంత్రాలు కావాలి. ప్రస్తుతం ఉన్న యంత్రాలతోనే పీలింగ్ చేస్తున్నాము. ఉప్పులో నానబెట్టిన దబ్బలను ఇతర రాష్ట్రాల్లో ఉన్న నగరాలకు ఎగుమతి చేస్తున్నాము. టన్ను రూ.5 వేలు పలుకుతోంది. టూటీఫ్రూటీ పరి శ్రమలు రైల్వేకోడూరులో పెడితే ఖర్చు పూర్తి స్థాయిలో తగ్గిపోతాయి.

పరిశ్రమలను స్థాపించాలి

- బ్రహ్మయ్య, రైల్వేకోడూరు, బొప్పాయి రైతు



రైల్వేకోడూరులో చిన్న తరహా పరిశ్రమలను స్థాపించాలి. దీంతో చాలా మందికి జీవనోపాధి కలుగుతుంది. రైతులు బొప్పాయి సాగు చేపట్టి దిగుబడులు వచ్చిన తర్వాత కాయ లను రెండు నుంచి మూడుసార్లు కోతలు జరిగిన తర్వాత మధ్యస్తంగా ఉన్న కాయలను పీలింగ్ వ్యాపారులకు విక్రయిస్తారు.



పీలింగ్ కేంద్రానికి తరలించిన బొప్పాయి కాయలు



పెద్ద తొట్టిలో ఉప్పులో నానబెట్టిన బొప్పాయి దబ్బలు



బొప్పాయితో తయారు చేసిన చెర్రీస్

'గజగజ' వణుకుతున్న పీలేరు!

పీలేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏనుగుల సంచార సమాచారంతో పీలేరు శుక్రవారం గజగజ వణికిపోయింది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు, రామిరెడ్డిగారిపల్లె ప్రాంతాల్లో తిష్టవేసిన ఏనుగులు మళ్లీ పీలేరు వైపు వస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆ గ్రామాలకు పొరుగున్న పీలేరు మండలం ఎర్రగుంటపల్లె, అగ్రహారం పంచాయతీ ప్రజలు భయంతో వణికిపోయారు. ఈ నెల 15న ఏనుగుల దాడిలో పీలేరు మండలం కాకులారంపల్లెకు చెందిన రైతు చిన్న రాజారెడ్డి చనిపోయిన విషయం తెలిసిందే. అప్పటి వరకు ఏనుగుల ఊసు తెలియని పీలేరు మండల ప్రజలకు వాటి భయం పట్టుకుంది. 15వ తేదీన రాత్రి ఏనుగులను పీలేరు ప్రాంతం నుంచి కల్లూరు ఘాటులోకి అటవీ అధికారులు విజయవంతంగా తరిమేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం ఆ ఏనుగుల గుంపు పులిచెర్ల వైపు రావడం, అక్కడి రైతులు, అటవీ శాఖాధికారులు వాటిని మళ్లీ అటవీ ప్రాంతంలోకి తరిమే క్రమంలో అవి దారి తప్పి పీలేరు వైపు రావడం జరిగింది. ఈ విషయాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పీలేరు ప్రజలు హడలెత్తిపోయారు. అవి మళ్లీ తమ ప్రాంతాల్లోకి ఎక్కడ వచ్చేస్తాయోనని పులిచెర్ల మండల సరిహద్దు గ్రామాలైన అగ్రహారం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లె, ఎనుములవారిపల్లె భయంతో గడిపారు. అయితే ఏనుగుల సంచారం గురించి తెలుసుకున్న పీలేరు, మదనపల్లె బీట్ అటవీ సిబ్బంది గురువారం రాత్రి నుంచి అవి పీలేరు వైపు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చుతూ రాత్రంతా పులిచెర్ల-పీలేరు సరిహద్దు గ్రామాల్లో గడిపారు. దీంతో శుక్రవారం అవి పీలేరు మండలంలో ప్రవేశించలేకపోయాయి. ఒకసారి వచ్చినవి మళ్లీ మళ్లీ వస్తాయన్న భయంతో ఏనుగుల సంచారంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసు కొట్టివేత

రాయచోటిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కేసును రుజువు చేయడంలో పోలీసులు విఫలమయ్యారంటూ రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి శుక్రవారం ఓ హత్య కేసును కొట్టివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ పెద్దగొల్లపల్లెకు చెందిన బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ, బుట్టిమాని చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్య ముగ్గురూ ప్రాణస్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి మెలిసి తిరిగేవారు. ఈ క్రమంలో చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన ఎర్రయ్యకు 2019 నవంబరులో భూతగాదాలు ఏర్పడ్డాయి. ఈ విషయంలో ఎర్రగొల్లి ఎర్రయ్యకు మద్దతు తెలిపాడన్న కారణంతో బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ కలిసి 2019, నవంబరు 7న చిన్నప్ప సోదరుడు తిమ్మయ్యను హత్య చేశారని సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును రుజువు చేయడంలో పోలీసులు విఫలమయ్యా రని రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి కేసును కొట్టి వేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుల తరపున న్యాయవాది టి.ఈశ్వర్‌రెడ్డి, పి.రెడ్డయ్యలు వాదించారు.

మరమ్మతు పనులతో...

బిరాబిరా కదులుతున్న పింఛా జలాలు



సప్లై ఛానెల్‌లో పనులు చేస్తున్న కూలీలు

పీలేరు, అక్టోబరు 25: ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సప్లై ఛానెల్‌కు అధికారులు, టీడీపీ నాయకులు చేపట్టిన మరమ్మతు పనులు సత్ఫలితాలు అందిస్తున్నాయి. మరమ్మతుల కారణంగా అడ్డంకులు తొలగడంతో పింఛా జలాలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకువైపు బిరాబిరా కదులుతున్నాయి. సమ్మర్ స్టోరేజ్ కంటే ముందు ఉన్న కాకులారంపల్లె పంచాయతీ ఎర్రదొడ్డిపల్లె చెరువులోకి గురువారం సాయంత్రం పింఛా జలాలు చేరుకోవడంతో అటు పీలేరు వాసులు, ఇటు కాకులారంపల్లె పంచాయతీ వాసుల్లో ఆశలు చిగురించాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పింఛా నది నుంచి సప్లై ఛానెల్ ఉన్నప్పటికీ కాంక్రీటు కట్టడం కాకపోవడంతో కాలక్రమంలో అది బలహీన పడింది. దీంతో నీటి ప్రవాహంపై అనుమా నాలు ఏర్పడ్డాయి. ఈ విషయం కాకులారంపల్లె నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే సప్లై ఛానెల్‌కు మరమ్మతులు యుద్ధప్రాతి పదికన చేపట్టాలని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో ఆయన వ్యక్తిగత కార్యదర్శి సత్య, అధికారులు, నాయకులతో సమన్వయం చేసుకుని ఈ నెల 22న మరమ్మతులు ప్రారంభించారు. పింఛా నది నుంచి నీటిని సప్లై ఛానెల్‌కు అనుసంధానం చేసే స్థలం నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వరకు మరమ్మతులు పనులు పూర్తి చేశారు. దీంతో ఛానెల్‌లో నీటి ప్రవాహం ఆరంభమైంది. అయితే విపరీతంగా పెరిగిపోయిన జమ్ము, పొదలు, చెట్ల కొమ్మలు ప్రవాహానికి అడ్డుపడుతుండడంతో శుక్రవారం ఉదయం కూలీలను రంగంలోకి దింపి వాటిని తొలగించే పనులు చేపట్టారు. దీంతో ఛానెల్‌లో ప్రవాహ వేగం పెరిగింది. ప్రస్తుతం పింఛా జలాలతో ఎర్రదొడ్డిపల్లె చెరువు పాక్షికంగా నిండింది. మరో రెండు రోజుల్లో అది నిండిపోతుందని, ఆ తరువాత సమ్మర్ స్టోరేజ్‌కు జలాలు పరుగులు పెడతాయని యల్లెల రెడ్డప్పరెడ్డి తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఒకసారి నిండితే మూడేళ్ల పాటు పీలేరు పట్టణంతో పాటు కాకులారంపల్లె ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి!

● స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ

గాలివీడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ విజ్ఞప్తి చేశారు. గాలివీడు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ నిర్వహణపై శుక్రవారం ఆయన సమీక్షించారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు వేల అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఈ సంఖ్య మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ రూ.200ల అపరాధ రుసుముతో ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, రూ.500ల అపరాధ రుసుముతో ఈ నెల 30, 31 తేదీలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అర్హులైన వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గాలివీడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గేశ్వర రాజు, మొహిద్దీన్ బాషా, కో-ఆర్డినేటర్ నాగరాజు, మహేశ్వరయ్య, మధుమతి, శివానంద్, శివారెడ్డి, రమణయ్య, వెంకటయ్య, నిర్మలా దేవి, ఫైరోజ్, షబానా, సుబ్బారాయుడు, మధుమతి, శివానాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన విగ్రహాలు రికవరీ - ఇరువురి అరెస్టు


రాజంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చోరీకి గురైన విగ్రహాలు రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మన్నూరు పోలీసు స్టేషన్‌లో సీఐ రామాంజనేయులుతో కలసి ఆయన వివరాలు వెల్లడించారు. రాజంపేట మండలం పోలిచెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోని ఆంజనేయ, లక్ష్మీదేవి, వినాయక విగ్రహాలు ఈనెల 17న చోరీ అయ్యాయన్నారు. ఈ కేసులో దర్యాప్తు చేసిన పోలీసులు సయ్యద్ మస్తాన్‌బాషా, షేక్ మస్తాన్ కలీంను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక అడుగు ఎత్తు గల ఇత్తడి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, అర్థడుగు లక్ష్మీదేవి విగ్రహం, అర్థడుగు ఇత్తడి వినాయక విగ్రహాలతోపాటు, రూ 8 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చెక్కు చెదరని అపూర్వ కట్టడం

● 200 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం

● కడపకు తలమానికంగా పాత కలెక్టరేట్

● మ్యూజియంగా మారిస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగం



కడప కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెక్కు చెదరని అపూర్వ కట్టడంగా కడప నగర నడిబొడ్డున గల పాత కలెక్టరేట్ నేటికీ దర్శనమిస్తోంది. నాటి బ్రిటీష్ తెల్లదొరల హయాంలో గత 1808 సంవత్సర కాలంలో ఈ భవన నిర్మాణం చేసినట్లు తెలుస్తోంది. 200 ఏళ్ల నాటి నిర్మాణం కావడంతో కడపకు తలమానికంగా చెప్పవచ్చు.

నగర ఏడురోడ్ల కూడలికి దగ్గరగా నిర్మించిన పాత కలెక్టరేట్ పూర్తిగా రాయి, గచ్చు, ఇటుక, ఉక్కు, రంగూన్ టేకుతో అప్పట్లో చాలా కట్టుదిట్టంగా నిర్మించడంతో ఇప్పటికీ ఆ భవనం హుందాతనంతో కళాత్మకంగా చూపరులను ఆకట్టుకుంటోంది. భవనానికి ప్రధాన ద్వారం ఉత్తర దిక్కున ఏర్పాటు గావించారు. కింద నుంచి పై అంతస్తుకు వెళ్లేందుకు వీలుగా నాలుగు దిక్కుల గుండా మెట్ల మార్గాలున్నాయి. ఒక్కో మెట్ల మార్గంలో ఏడు మలుపులతో వుంటూ ఆ లెక్కన ప్రతీ మలుపులో ఐదేసి మెట్లు వున్నాయి. పూర్తిగా భవనం పైభాగానికి వెళ్లాలంటే ఆగ్నేయం మూలలో గల మెట్ల మార్గం గుండా వెళ్లాలి. స్వాతంత్ర్యానికి పూర్వం కడప మొట్టమొదటి కలెక్టర్‌గా సర్ థామస్ మన్రో, ద్వితీయ కలెక్టర్‌గా డబ్ల్యూ డబ్ల్యూ చాప్లిన్, తృతీయ కలెక్టర్‌గా జి.గ్రెగరి సేవలందించారు. కాగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత (1947) మొట్టమొదటి కలెక్టర్‌గా ఆర్.ఎస్.మలయప్పన్, ద్వితీయ కలెక్టర్‌గా డబ్ల్యూ.హెచ్. మిచ్చెల్, తృతీయ కలెక్టర్‌గా టి.ప్రభాకరరావు నాయుడు సేవలందించారు.

ఇదిలా వుండగా భవనానికి పడమర వైపు పోర్టికో, ఉత్తరం వైపున ట్రెజరీ గార్డ్ వుండేవి. ఇందులో కోనేరు రంగారావు కమిటీ (కెఆర్ఆర్) డిప్యూటీ కలెక్టర్ చాంబర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ క్యాంప్ క్లర్క్ గది, అలాగే రెండవ జాయింట్ కలెక్టర్ చాంబర్, కలెక్టర్ క్యాంప్ క్లర్క్ గది, కలెక్టర్ చాంబర్, జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లు కూడా వుండేవి. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైడ్ నెట్‌వర్క్ (ఏపీ స్వాన్ గది) కాగా అందులో వున్న ఓ పెద్ద గదిలో ఎ-సెక్షన్, బి-సెక్షన్, సి-సెక్షన్, డి-సెక్షన్, ఇ-సెక్షన్, ఎఫ్- సెక్షన్, జి-సెక్షన్, డిస్పాచింగ్ విభాగాలు, సోషల్ వెల్ఫేర్ ల్యాండ్ ఆక్విజిషన్ (ఎస్.డబ్ల్యూ.ఎల్.ఏ) సిబ్బంది వుండేవారు. హాలుకు ఉత్తరం వైపు గ్రంథాలయం వుండేది. కాలగమనంలో 2008 ఆగస్టు 11 నుంచి గ్రంథాలయం స్థానంలో మినీ కాన్ఫరెన్స్ హాలు ఏర్పాటైంది. వీటితో పాటుగా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ చాంబర్ వుండేది. జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని ట్రెజరీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంగా ఒకప్పుడు పిలిచేవారు. లోపలి వైపు స్ట్రాంగ్ రూమ్ వుండేది. ఏదేమైనా కడపకు తలమానికంగా నిలిచిన పాత కలెక్టరేట్ 2016 ఏప్రిల్ వరకూ ప్రజలకు సేవలందించింది.

మ్యూజియంగా మారిస్తే బాగుంటుంది

నగర ఆర్ట్స్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన కొత్త కలెక్టరేట్ భవన సముదాయం నుంచి ప్రజాసేవలు ప్రారంభమైనప్పటి నుంచి పాత కలెక్టరేట్ భవనం కళావిహీనంగా దర్శనమిస్తోంది. భవనం చుట్టూ పరిసరాలు చెత్తా, చెదారం, మట్టితో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పాలకులు, జిల్లా అధికారులు కాసింత దూర దృష్టి సారించి ఆ భవనాన్ని మ్యూజియంగా మారిస్తే భవిష్యత్ తరాలకు గొప్ప ప్రాచీన సంపద అందించినట్లు అవుతుందని పలువురు జిల్లావాసులు కోరుతున్నారు.

వలపు వల.. చికార్కో విలవిల

- వీడియో కాల్‌లో అందమైన స్త్రీలు మాట్లాడతారు
- ముఖం కనబడితే చాలు.. మార్ఫింగ్ చేస్తారు
- నగ్న వీడియోలు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తారు
- డబ్బులు పంపకపోతే.. బెదిరింపులకు దిగుతారు
- వలపు వలలో చిక్కుకుంటున్న బాధితులు
- లక్షల్లో డబ్బులు సమర్పించుకుంటున్న వైనం



కడప క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మోసపోయేవారున్నంత వరకూ మోసం చేసేవారు తయారవుతూనే ఉంటారు. ఇప్పుడు సైబర్ మోసాలు ఎక్కువ అవుతున్నాయి. నేరగాళ్లు ఇతరులను టార్గెట్ చేసుకుంటూ వారి జేబులు నింపుకుంటున్నారు. ఒకరి ఆశ, ఇంకొందరి ఆత్యాశను క్యాష్ చేసుకోవడానికి వలపు వల విసురుతున్నారు. చదువు రానోళ్లే కాదు.. వీరి ఉచ్చులో విద్యార్థులు, ఉన్నత విద్య చదివినోళ్లు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

కొత్త నెంబర్ల నుంచి వీడియోకాల్ చేస్తారు. అనుకోకుండా ఏదైనా ముఖ్యమైన కాల్ ఏమో అని ఎత్తామా ఇక అంతే సంగతులు. అవతల అందమైన స్త్రీ నగ్నంగా ఉండి మాట్లాడుతుంది. ఆ కాల్ ఎత్తి మన ముఖం చూపిస్తే చాలు.. అటువైపు ఆమె, ఇటు పక్క బాధితుడు స్ర్కీన్ మీద కనిపిస్తున్న వీడియోను రికార్డు చేస్తారు. ఆ కాల్ కట్ చేసి మన ఫేస్‌ను మార్ఫింగ్ చేసి అశ్లీల పద్ధతిలో వీడియోలు తయారు చేసి మనకే పంపిస్తారు. ఇక బెదిరింపులు మొదలుపెడతారు. నగ్న వీడియోను కుటుంబ సభ్యులకు పంపుతామని, తెలిసిన వారుంటే ఆయా గ్రూపుల్లో షేర్ చేస్తామని బెదిరిస్తారు. తరువాత మనకు కాల్ చేసి డబ్బు ఇవ్వకుంటే ఆ వీడియోలు నీ గ్రూపుతో పాటు ఇతర సోషల్ మీడియాలో మీకు కాంటాక్ట్ ఉన్న ప్రతి ఒక్కరికీ పంపిస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగుతారు. దీంతో బాధితులు బయటికి చెప్పుకోలేక తమ పరిస్థితి ఇతరులకు చెబితే చిన్నచూపు చూస్తారేమోననే ఉద్దేశ్యంతో వారు అడిగిన డబ్బులు ఇస్తున్నారు. ఇలా సైబర్ నేరగాళ్లు రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. పోలీసులు ఒక పక్క అవగాహన కల్పిస్తున్నా.. కొత్త కొత్త విధానాలతో సైబర్ కేటుగాళ్లు తెగబడుతు న్నారు. జిల్లాలో ఇలాంటి సైబర్ నేరాలు చోటు చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

వాట్సప్‌లో కొత్త నెంబర్ల వీడియో కాల్స్ ఎత్తకండి



మీ కాంటాక్ట్స్‌లో లేకుండా ఉండి, గుర్తు తెలియని నెంబరు నుంచి వాట్సప్ వీడియో కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దు. ఒకవేళ ఎత్తాల్సి వస్తే మొబైల్‌లో ఫ్రంట్ కెమెరాను వేలితో మూసి లిఫ్ట్ చేయాలి. దీంతో మనం స్ర్కీన్‌లో కనిపించం. దీంతో అవతల వాళ్లు రికార్డు చేసే అవకాశం ఉండదు. ఎవరైనా మోసపోతే గంట వ్యవధిలో 1930కి కాల్ చేసి వివరాలు తెలపాలి. అపరిచిత కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి,
సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్, కడప

కడప జిల్లాకు చెందిన విశ్రాంత అధికారి వీరి ఉచ్చులో పడి దాదా పు రూ.8లక్షలు పోగొట్టుకున్నారు. ఓ పెద్ద ఉద్యోగి కూడా దాదాపు రూ.6లక్షల వరకు పోగొట్టుకున్నట్లు సమాచారం. దాదాపు 15 మంది వరకు సైబర్ నేరగాళ్ల వలలో పడి లక్షల్లో పోగొట్టుకుని చివరికి పోలీసులను ఆశ్రయించారు.

లింకులు క్లిక్ చేస్తే ఊడ్చేస్తారు

ఉచిత డేటా, ఐఫోన్ అంటూ ఊరించే సందేశాలు ఇప్పుడు సర్వసాధారణ మయ్యాయి. ఏ మాత్రం ఆశ పడి క్లిక్ చేసినా బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మంతా ఊడ్చేస్తారు. ఇక్కడ ఎవరూ ఏది ఉచితంగా ఇవ్వరనే విషయాన్ని గ్రహించాలి. ప్రజల మానసిక బలహీనతలతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. లక్షకు పైగా సంపాదించవచ్చు, రోజుల వ్యవధిలో పెట్టుబడి రెట్టింపు అవుతుంది లాంటి ప్రకటనలు ఊరిస్తున్నాయని, వీటిని నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

దోమల నియంత్రణకు పాటుపడాలి

- జిల్లా మలేరియా అధికారి మనోరమ



వాటర్ డ్రమ్ములను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మనోరమ

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించి దోమల నియంత్రణకు పాటుపడాలని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ అన్నారు. శుక్రవారం నగరంలోని అగాడి వీధిలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వీధిలోని పలు ప్రాంతాలను పరిశీలించి స్థానికులకు తగు సూచనలు చేశారు. వారానికి ఒక సారైన ఇళ్లలోని తొట్లు, బానలు, కుండలను శుభ్రం చేసి ఆరబెట్టాలన్నారు. కాచీ చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ జ్వరాల నుంచి తప్పించుకోవాలంటే పరిశుభ్రతతో పాటు దోమల నియంత్రణకు రాత్రి నిద్రించు సమయంలో దోమలు కుట్టకుండా తప్పకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసరు డాక్టర్ శ్రావణి, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సీహెచ్‌ఓ చిన్న పుల్లయ్య, సబ్‌యూనిట్ ఆఫీసరు నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లాలో పక్కాగా పశుగణన ప్రారంభం

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్త ంగా శుక్రవారం ఉదయం నుంచి జాతీయ పశుగణన ప్రారంభమైంది. ముందుగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిల నివాసాలకు జిల్లా పశు వైద్యాధికారిణి శారదమ్మ తన సర్వే సిబ్బందితో కలసి వెళ్లి 21వ పశుగణన సర్వేను ప్రార ంభించారు. పశుగణన సర్వే ప్రక్రి యలో భాగంగా జిల్లా పశు వైద్యాధికారులు, పశుగణన కోసం నియమించిన శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందితో ఈనెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన నిర్వహించనున్నారు. జిల్లాలో 2019లో జరిగిన గణన ప్రకారం జిల్లాలో ఆవులు, ఎద్దులు 44,656, గేదేలు 3,99,910, గొర్రెలు 9,83,684 మేకలు 3,62,582, పందులు 2,777, కోళ్లు 1,95,152 ఉన్నాయి. ప్రస్తుతం చేపట్టిన పశుగణాంకాలతో ఈ లెక్కలు పక్కాగా తేలనున్నాయి. అంతేకాకుండా గుర్రాలు, ఒంటెలు కలుపుకొని 16 రకాల పశుసంపదను ఈ గణనలో సర్వే సిబ్బంది లెక్కలు కట్టి యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌రెడ్డి, డీడీ డాక్టర్ రంగస్వామి, ఏడీ డాక్టర్ శ్రీధర్, లింగారెడ్డి, ఎన్యుమరేటర్స్ మాహన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు 12వేల క్యూసెక్కుల కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వా యిర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాల్వ ద్వారా గండికోట ప్రాజెక్టుకు 12 వేల క్యూసెక్కులు కృష్ణాజలాలు వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే 6వేలు వస్తుం డగా మరో 6 వేలు శుక్రవారం నుంచి వస్తున్నాయన్నారు. దీంతో మైలవరం జలాశయానికి శుక్రవారం రాత్రి 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు తెలిపారు. అదే విధంగా మెయిన్ కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులు తున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ప్రతిభ



ప్రతిభచూపిన విద్యార్థి సువర్ణను అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త

వేంపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సువర్ణ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈనెల 14 నుంచి 18 వరకు గోవాలో జరిగిన 33వ నేషనల్ బెంచ్ ప్రెస్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సువర్ణ కాంస్యపతకం సాధించింది. డైరెక్టర్ కుమారస్వామి గుప్త శుక్రవారం ఆ విద్యార్థినిని అభినందించారు. కోచ్ తివారి శిక్షణలో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు ఓబయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ గోడౌన్‌ల తనిఖీలు



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న డీఎన్‌సీసీ అధికారులు

కడప (క్రైం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనకు ఎస్పీ హర్షవర్దన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ)ఆధ్వర్యంలో శనివారం కడప జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ కార్యాలయాలు, గోడౌ న్‌లలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయాలపై ప్రజలు సహకరించి సమాచారం అందించాలని డీఎన్‌సీసీ అధికారులు కోరారు.

మెడికల్ స్టోర్లను తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



మెడికల్ స్టోర్లలో రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్తు మందులతో యువత చిత్తు అవుతోందని ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగకిరణ్ ఆధ్వర్యంలో కడప డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి, రాయచోటి ఇన్‌స్పెక్టర్ జయరాముడులు శుక్రవారం నగరంలోని పలు మెడికల్ షాపులను అకస్మికంగా తనిఖీలు చేశారు. మత్తు కల్గించే మందుల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను వారు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన రెండు షాపులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివే దికలు పంపారు. ఈ తనిఖీలో పోలీసులు కూడా పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా మరింత నైపుణ్యం



ఎఫ్3 కార్ పనితీరును వివరిస్తున్న ట్రైనర్ రాహుల్‌రంజన్

పులివెందుల రూరల్, అక్టోబరు 25: శిక్షణ ద్వారా మరింత నైపుణ్యాతను పెంపొందించుకోవచ్చని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ అరుణకాంతి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో యంత్ర- 2కె 24 జాతీయ సదస్సును రెండవ రోజైన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంకే ఇండస్ట్రీస్ ట్రైనర్ రాహుల్ రంజన్ ఎఫ్3 కార్ డిజైన్, పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు రామేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు చంద్రశేఖర్, రాజేష్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు సేవ చేయడం అభినందనీయం



యోగివేమన పశువైద్య విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలతను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు పశువైద్యులు సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో మూగజీవాలకు సేవ చేయడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. మూగజీవాలపై ప్రేమతోనే పశువైద్య కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కళాశాల ఏర్పాటుకు చేసిన కృషిని, కష్టాన్ని గుర్తు చేసుకుని ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు. కళాశాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు, నివారణ చర్యలు, తక్కువ ఖర్చుతో సమీకృత దానా తయారీ వంటి అంశాల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజాకిశోర్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో ఎనిమిది టెక్నికల్ సెషన్స్ జరిగాయన్నారు. అలాగే 16 లీడ్ పేపర్స్‌ను ప్రజంట్ చేశారని, 181 పరిశోధన పత్రాలను శాస్త్రవేత్తలు ప్రజంట్ చేశారన్నారు. అనంతరం ఉత్తమ పరిశోధన ఫలాలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ సీఈఓ ఎం.శ్రీనివాసరావు, పశువైద్య విశ్వవిద్యాలయం అధ్యాపకులు, పశువైద్య కళాశాల వైద్యులు, ఎస్‌జీఎస్‌బీటీ అధ్యక్షుడు డాక్టర్ థాని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి



మృతులు సిద్దారెడ్డి, మన్సూర్

సికెదిన్నె, అక్టోబరు 25: మండల పరిధిలోని ఊటుకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొన్నోలు చిన్నసిద్దారెడ్డి (52), షేక్ మన్సూర్ (20) మృతి చెందారు. సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన పొన్నోలు చిన్నసిద్దారెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈయన గురువారం రాత్రి ఊటుకూరు నుంచి కడపకు వెళ్లేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలోని ఓ లాడ్జి వద్దకు రాగానే కడప నుంచి బైకులో మన్సూర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సిద్దారెడ్డి గురువారం రాత్రి, మన్సూర్ శుక్రవారం మృతి చెందారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఇరువురు మృతితో ఊటుకూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఊటుకూరు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పొన్నోలు సుబ్బిరెడ్డి తమ్ముడు చిన్నసిద్దారెడ్డి కావడంతో వారి కుటుంబాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబానికి పార్టీ అన్ని విధా లా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రమాదవశాత్తు బుగ్గవంకడ్యాంలో పడి విద్యార్థి మృతి

సికెదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక డ్యాంలో గాలి ప్రేమ్ కుమార్(17) అనే విద్యార్థి గల్లంతై మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం బుగ్గవంక డ్యాంను చూడటానికి ప్రేమ్‌కుమార్, తన నలుగురు మిత్రులతో కలిసి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. వారి స్నేహితులు ఎవరికి ఈత రాకపోవడంతో ఇంటికి వెళ్లి బంధువులకు తెలపడంతో వారు సికెదిన్నె పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కాగా ప్రేమ్‌కుమార్ శ్రీహరి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నముక్కపల్లె వద్ద నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి సంబంధించి వివరాలు లేవు. ఎవరైనా ఇతన్ని గుర్తిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై వ్యక్తికి తీవ్ర గాయాలు



పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు హరిజనవాడలో వేంపల్లె వరపుత్రుడు అనే వ్యక్తి ఇంటిలో గ్యాస్ సిలిండర్ లీకేజీ అయ్యింది. దీంతో మంటలు రావడంతో ఇంట్లో ఉన్న వరపుత్రుడుకు తీవ్ర గాయాలయ్యాయి. శరీరం కాలడంతో నందిమండలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనలో కడప రిమ్స్‌కు తరలించారు.

స్థానిక అవసరాలకు ఇసుక ఉచితం

కడప కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను స్థానికుల అవసరాల కోసం వాగులు, వంకలు నుంచి ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల నుంచి తీసుకెళ్లవచ్చని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని రాష్ట్ర గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాజధాని అమరావతి నుంచి ఇసుక పాలసీ అమలు తీరుతెన్నులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, గనులశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ఇసుక పాలసీలో ఇసుక అవసరం ఉన్న ప్రతి వినియోగదారుడు పారదర్శకంగా ఇసుక తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక తీసుకొనేటపుడు సీనరేజ్ ఫీజును పూర్తిగా మాఫీ చేయడం జరిగిందన్నారు. ఇసుక రీచ్‌లు అందుబాటులో లేని ప్రజలకు ఆ ప్రాంత అవసరాలకు సరిపడే ఇసుక అందించే క్రమంలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వాణిజ్యపరంగా ఉచిత ఇసుక విక్రయిస్తే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు. వీసీ ముగిసిన అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక డంప్‌ల నుంచి ఇసుకను రాత్రల్లో తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో గనులశాఖ డీడీ సూర్య చంద్రరావు, గ్రౌండ్‌వాటర్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

పెండ్లిమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్ర అయిన పొలతల దేవస్థానానికి శివపార్వతులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చల్లని దొర, తహసీల్దార్ అనురాధలు తెలిపారు. పొలతలలోని టూరిజం భవనంలో శుక్రవారం మండలస్థాయి అధికారులతో కార్తీక మాస ఉత్సవాలపై అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం క్యూలైన్లు, పార్కింగ్ తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణానాయక్, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.5.55 లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న అరవింద స్కూలు యాజమాన్యం

ప్రొద్దుటూరు అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదలతో తీవ్రంగా నష్టపోయిందని.. చంద్రబాబు కృషితో అక్కడ ప్రజలకు మెరుగైన పరిస్థితులు కల్పించారని.. అలాంటి ముఖ్యమంత్రికి అండగా నిలబడటానికి సహాయనిధి కింద రూ.5,55,555 అందజేస్తున్నట్లు అరవింద ఇంటిగ్రల్ స్కూలు కరస్పాండెంట్ వంకదార వీరభద్రయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎంఆర్‌కాలనీలోని అరవింద స్కూలులో ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి అందజేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీఎం సహాయ నిధికి రూ.5.5లక్షల విరాళం ఇవ్వడంపై ఆయన అభినందించారు. కార్యక్రమంలో కాశీపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, SYED FASEEHA BANU (Old Name), W/o JEELANI SYED, residing at Door No. 15-126, Kamsala Street, New Pet, Palamaner, Town, Post and Mandal, Chittoor Dist, AP-517408 hereby declare that I have changed my name KHAZI FASEEHA BANU (New Name) for all future purposes.
AJT - 200609

CHANGE OF NAME
I, D. Thulasi Rani Spouse of late K. Neerajakshulu Naidu Rank Naik No:6378058N Resident of D. No 6-94,Rajakula colony, Pudipatla Village & Post Tirupati Rural, Tirupati Dt, ANDHRA PRADESH, INDIA have changed my name from THULASI RANI (old name) to D.th clasi RANI (NEW NAME) D. O. B 16-05-1975, That both names pertain to one and the same person
AJT - 4430

CHANGE OF NAME
I, Sudhakar Reddy Vallivedu S/o Vallivedu Bhaskar Reddy (Old Name) R/o D. No 20-2-472/71, Korlagunta, Maruthi Nagar, Tirupati Town & District, AP have changed my name to SUDHAKARA REDDY VALLIVEDU (New Name)
AJT - 4426

CHANGE OF NAME
I, Ammilineni Rajani (Old Name), W/o Amilineni Suresh Naidu Bearing Passport No. U8914766, R/o 18-1-652, 1st Floor, Bhavani Nagar, Tirupati (Urban & Dist), A.P. Have Changed My Name as AMILINENI RAJANI (New Name)
AJT - 10883

PLOTS FOR SALE
రంగంపేట మోహన్ బాబు యూనివర్సిటీకి ఎదురుగా దాలర్స్ 15 లో 122 (55 అంకణాలు) ఈస్ట్ ఫేసింగ్, తుడా అప్రూవల్ గల ప్లాట్ అమ్మబడును. 1 అంకణం 78000 రూ మాత్రమే . సెల్: 99660 66111
AJT - 4428

PLOTS FOR SALE
తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర TCL కంపెనీకి ఎదురుగా తక్కువ బడ్జెట్కే తుడా ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ అందుబాటులో కలవు. 82470 75857, 94943 92069
AJT - 4429

WANTED
బోత్ హాస్పిటల్, కొర్లగుంట, తిరుపతి నందు పనిచేయుటకు వార్డు బాయ్స్ కావలెను. నైట్ డ్యూటీ సెక్యూరిటీ గార్డ్, వంట మనిషి (ఆడ) కావలెను. సెల్ : 99494 23941, 81254 62933.
AJT - 4431

WANTED
Telesales Persons from Tirupati, Females work from home,willing to work hard required for a Temporary Project. Contact : 85009 60577
AJT - 4422

WANTED
Wanted Tele Callers/Marketing Officers / Team Leaders, Salary Rs. 20,000/- pm + Incentives upto Rs.25,000/-, RKC Group: 8801501376, 8801502343.
AJT - 4404

PLOTS FOR SALE
36 months EMI Plots for Sale. Near Yerpedu IIT, IISER & IT Hub, Final Approved & Spot Registration. RKC Developers : 88015 01376.
AJT - 4405

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 198452

PLOTS FOR SALE
నేషనల్ హైవేలో ఏర్పేడు వెంకటగిరి రోడ్లో ఐఐటికి ఎదురుగా తుడ అప్రూవ్డ్ ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి దీపావళి ఆఫర్. 2గ్రా, గోల్డ్ కాయిన్. 95027 74175 / 74162 11984.
AJT - 4412

హరిహర వాటర్ ప్రూఫింగ్
★ రూఫ్, స్లాబ్, ఓపెన్ టెర్రస్ బాల్కనీ, సైడ్ వాల్స్, ట్యాంక్స్, బాత్రూమ్స్, బిల్డింగ్ లీకేజీ సమస్యలను బ్రాండెడ్ కెమికల్స్‌తో ఇంజక్షన్ గ్రౌట్ ద్వారా 10 సం. గ్యారంటీతో చేయబడును. Ph: 8985714713 AJH-826

WANTED
» రెడ్డీస్ కంపెనీ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్ మరియు హెల్పర్స్ ఆడ/మగ వారు కావలెను. జీతం: సూపర్‌వైజర్‌కు 35,000/-, హెల్పర్‌కు 23,000/-. వసతి భోజనం కలదు. సంప్ర. 6309895378.
AJV_204667

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆధార్‌లో మార్పులకు తప్పని తిప్పలు

- అప్లికేషన్‌లో తహసీల్దార్ సంతకాలనే అనుమతిస్తున్న ఆధార్ సెంటర్ నిర్వాహకులు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవాలన్నా, బ్యాంకులలో ఖాతాలు తెరవాలన్నా, పాఠశాలల్లో విద్యార్థులు చేరాలన్నా ఆధార్ కార్డు తప్పని సరి. ఆధార్‌లో పేరు మార్పు, పుట్టిన తేదీల మార్పు, చిరునామాలు ఫొటో, బయోమెట్రిక్ వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పుడు అవకాశం కల్పించింది. అయితే ఇటువంటి మార్పులు చేయాలంటే పక్కా ఆధారాలతోపాటు అప్లికేషన్ ఫాంలో గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి చేశారు. కాగా పలు రకాల గెజిటెడ్ అధికారుల సంతకాలు చేయవచ్చనే నిబంధన ఉన్నప్పటికి ఆధార్ కేంద్రాల అధికారులు కేవలం తహసీల్దార్ సంతకం మాత్రమే అంగీకరిస్తుండడంతో కార్డుదారులకు అసలు సమస్యలు మొదలయ్యాయి. ప్రభుత్వం నిబంధనల మేరకు ఆధార్‌లో అడ్రస్ మార్చుకోవాలంటే దరఖాస్తు ఫాంలో గెజిటెడ్ అధికారుల జాబితాలో గ్రూప్-ఏ, , గెజిటెడ్ ఆఫీసర్ గ్రూప్-బీ, ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ కౌన్సిలర్‌లు, తహసీల్దార్‌లు, ఎంపీడీవో, స్కూల్ హెడ్‌మాస్టర్, వెటర్నరీ డాక్టర్, ఎంఈవో, ట్రాన్స్‌కో ఏఈ తదితర అధికారులను పొందుపర్చారు. అటువంటి అధికారుల సంతకాలతో కార్డుదారులు సెంటర్‌కు వెళితే కేవలం తహసీల్దార్ సంతకం మాత్రమే అనుమతిస్తుండడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హెచ్‌ఎం సంతకం చేయించినా అనుమతించలేదు

ఆధార్ కార్డుల్లో ఇంటిపేరు, అడ్రస్ మార్చుకోవాలని దరఖాస్తు



ఆధార్ సెంటర్ల వద్ద బారులు తీరిన కార్డుదారులు

ఫాంలో గెజిటెడ్ అధికారి అయిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం చేయించాను. దరఖాస్తు ఫాంలో గెజిటెడ్ అధికారుల ఆప్షన్ ఉంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకం చేయించి మండల కేంద్రంలో ఉన్న ఆదార్ సెంటర్‌కు వెళ్లగా తహసీల్దార్ సంతకమే కావాలని లేక పోతే రిజెక్ట్ అయిపోతుందని అన్నారు. తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి ఒక్క రోజు వెళ్లగా తహసీల్దార్ అందుబాటులో లేరు. తిరిగి మళ్లీ ఒక రోజు వెళ్లగా తహసీల్దార్ గ్రామసభలకు వెళ్లారని సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా నిబంధనలను సడలించే విధంగా అవకాశం కల్పించాలి

- నచ్చు రామాంజులు సాలేవాండ్లపల్లె పీటీఎం

ప్రభుత్వ డాక్టర్ సంతకం చేయించినా తిరస్కరించారు

నా ఆధార్ కార్డులో అడ్రస్ తప్పుగా ఉండడంతో అడ్రస్ మార్పు చేయడం కోసం ఆధార్ సెంటర్‌కు వెళ్లాను అక్కడ ఒక ఫాం ఇచ్చి గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని రమ్మన్నారు. మా ఊళ్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆసుపత్రి డాక్టర్ వద్ద సంతకం చేయించుకుని వచ్చాను. అందులో తప్పని సరిగా తహసీల్దార్ సంతకమే ఉండాలని చెప్పారు. ఇప్పుడు ఏమి చేయాలో దిక్కు తోచడంలేదు.

- వెల్లిబోయిన రవికుమార్ పీటీఎం మండలం

పీటీఎంలో మూడు ఆధార్ సెంటర్లు ఏర్పాటు

పీటీఎం మండలంలో మూడు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.ఇందులో ఒకటి పెద్దతిప్పసముద్రం, తుమ్మరకుంట, కాట్నగల్లులో ఏర్పాటు చేశారు. తుమ్మరకుంటలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో అక్కడ సెంటర్ నడవడంలేదు. పెద్దతిప్పసముద్రం, కాట్నగల్లులో సెంటర్లు నడుస్తున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలల్లో కేంద్రాలు నిర్వహించాలని భావించాం. అయితే పాఠశాలల్లో వారికి చదువులకు ఇబ్బందులు కలుగుతాయని మండల కేంద్రంలో సెంటర్లు ఏర్పాటు చేశాం. ఆధార్ కేంద్రాలు నిరంతరం కొనసాగుతాయి.

-యోగానంద్, ఈవోపీఆర్డీ, పీటీఎం మండలం

విద్యార్థుల ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం



ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందులో విద్యార్థులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయా గ్రామా ల్లో ఉన్న ఆధార్ సెంటర్లలో మార్పులు, చేర్పులు చేసుకునేలా ఫాంలో సంతకాలు పెట్టి పంపిస్తున్నాం. విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఆధార్ కార్డుల వివరాలను అందించాలి. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన విద్యార్థులు కాని కార్డుదారులు కాని ఎటువంటి ఇబ్బందులు పడకుండా సంతకాలు చేస్తున్నాం

- శ్రీరాములునాయక్, తహసీల్దార్, పీటీఎం మండలం

దిమ్మెల ఏర్పాటును అడ్డుకున్న దుకాణదారులు

- పనులు చేయిస్తున్న సిబ్బంది, దుకాణదారుల వాగ్వావాదం

ములకలచెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో ముంబాయి - చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దుకాణాల ముందు అడ్డుగా దిమ్మెలు ఏర్పాటు చేస్తుండగా దుకాణదారులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మయిన్‌బాషా దుకాణదారులను పిలుచుకొచ్చి పనులు చేపట్టకుండా ఎక్స్‌కవేటర్‌కు అడ్డుగా



దిమ్మెల ఏర్పాటును అడ్డుకుని రోడ్డుపై బైఠాయించిన దుకాణదారులు

దుకాణదారులతో కలిసి బైఠాయించారు. దుకాణాల ముందు దిమ్మెలు పెడితే వ్యాపారాలు జరగవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలోకి వెళ్లేందుకు దారి, 108 వచ్చేందుకు కూడా వీలు ఉండదని వాపోయారు. పనులు చేయిస్తున్న సిబ్బంది, దుకాణదారుల మధ్య వాద్వాదం చోటు చేసుకుంది. దీంతో సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రిలు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరపల్లి జయచంద్రారెడి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దుకాణదారులతో మాట్లాడి రోడ్డుకిరువైపులా ప్రతి 30 మీటర్లకు ఆటో వెళ్లే విధంగా దారి వదలాలని పనులు చేయిస్తున్న సిబ్బందికి తెలియజేశారు. దీనికి దుకాణదారులు కూడా సమ్మతించడంతో సమస్య పరిష్కారమైంది. ఈ కార్యక్రమంలో దుకాణదారుల సంఘం అధ్యక్షుడు మతీన్‌బాషా, నాయకులు రియాజ్, శ్రీరాములులతో పాటు పెద్దఎత్తున దుకాణదారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో లక్ష సభ్యత్వాలు చేయించడమే లక్ష్యం

ములకలచెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై జరిగిన తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యకర్తల



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

సమావే శంలో ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదును పండగ వాతావరణంలా చేపట్టాలన్నారు. జిల్లాలోనే అత్యధికంగా సభ్యత్వాలు చేపట్టి ప్రథమ స్థానంలో నిలుద్దామన్నారు. సభ్యత్వం చేసు కున్న వారికి ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ఇన్సూరెన్సు ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్ మట్లాడుతూ సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, తంబళ్లపల్లె మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, నేతలు విశ్వనాథరెడ్డి, తులసీధర్‌నా యుడు, కట్టా సురేంద్రనాయుడు, దేరంగుల నారాయణ, రాఘవరెడ్డి, నాయకులు భజంత్రి రామాంజులు, రషీద్, గోపాల్‌రాజు, బుర్రా రమణ, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోఓల్టేజి సమస్య నివారణకు చర్యలు

కలకడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణా ప్రాంతాల రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ లోఓల్టేజి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎర్రకోటపల్లి సబ్‌స్టేషన్‌లో పూర్తయిన టెక్నికల్ చార్జీంగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ప్రసుత్తం విద్యుత్ కేంద్రంలో 5ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌పార్మర్ మాత్రమే ఉందన్నారు. దీంతో నాణ్యమైన సరఫరాను అందించేందుకు వీలుగా ఇక్కడ అదనంగా మరో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌పార్మర్‌ను అమర్చడం జరిగిందన్నారు. ఈ పరిస్థితితో పరిధిలోని గ్రామల రైతులకు వ్యవసాయానికి మెరుగ్గా పగటి పూట 9 గంటల కరెంట్ ఇవ్వడానికి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈలు రామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, డిఈఈలు శివయ్య ఆదినారాయణ, ఎఈఈలు సుబ్రమణ్యం రాజశేఖర్, వరప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలకడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కలకడ సబ్‌స్టేషన్ సాంకేతిక మరమ్మతుల కారణంగా మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని కలకడ, కె దొడ్డిపల్లి, బాలయ్యగారిపల్లి, బాటవారిపల్లి గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమస్య ఉంటుందన్నారు. ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గురుకులాన్ని తనిఖీ చేసిన న్యాయాధికారి

పీలేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పీలేరులోని గిరిజన బాలుర గురుకులాన్ని శుక్రవారం స్థానిక 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలోని తరగతి గదులు, వంట శాల, స్నానాల గదులను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. చదువుతోపాటు క్రీడల పట్ల కూడా శ్రద్ధ వహించాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న న్యాయాధికారి

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని గురుకులం సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రబీ పంటలపై రైతులకు అగాహన కల్పించండి

కురబలకోట, అక్టోబరు 22: రబీ పంటలైన టమోటా, వరి, వేరుశనగాపై రైతులకు అగాహన కల్పించాలని ఏడీ శివశంకర్, పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంగళ్లులో మదనపల్లె డివిజన్ వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ



శిక్షణాతరగతులు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

తక్కువ పెట్టుబడితో వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించాలన్నారు ప్రధానంగా శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల సాగు చేయాలన్నారు. కార్యక్ర మంలో ఏవో రాధ, శాస్త్రవేత్తలు పీరుసాహెబ్, బాలహుస్సేన్, డీఆర్‌డీ ఏవోలు సుచిత్ర, రాజారమేష్, వెంకటమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9వ తరగతి విద్యార్థికి సబ్‌కలెక్టర్ ప్రశంసలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక మాల్‌న్యూట్రిషన్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రాజెక్టు రూపొందించిన మదనపల్లెలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పి. లోహన్‌ను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రశంసించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విద్యార్థి లోహన్ సబ్‌కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ మాల్‌న్యూట్రిషన్ వ్యాధితో దేశంలో 6శాతం మంది మృతి చెందుతున్నారన్నారు. ఈ విషయమై బయాలజి పుస్తకాలు, గ్రంథాలు చదివి ఈ వ్యాధిని అరికట్టడం ఎలా అనే విషయాలతో ఒక ప్రాజెక్టును సిద్ధం చేశామన్నారు. చిన్న వయస్సులోనే పెద్ద ప్రాజెక్టును కనుగొన్న లోహన్‌ను సబ్‌కలెక్టర్ ప్రశంసిస్తూ సర్టిఫికెట్ అందజేశారు. అలాగే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కూడా విద్యార్థి లోహన్‌ను అభినందించారు.



విద్యార్థి లోహన్‌ను అభినందిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

క్షయ వ్యాధి నిర్మూలనకు ఎంఎల్‌హెచ్‌ఓలు కృషి చేయాలి

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనకు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌ఓ)లు కృషి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, కందుకూరు పీహెచ్‌సీలకు చెందిన ఎంఎల్



మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శైలజ

హెచ్‌ఓలతో సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు వైద్యాధికారిణి మాట్లాడుతూ క్షయ, లెప్రసి వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంవోటీసీ డాక్టర్ శంకర, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పురుషోత్తంనాయక్, మహ్మద్ ఎస్తానీ, లెప్రసి డీపీఎం శ్రీనివాసులు. వేణుగోపాల్, టీబీ సూపర్ వైజర్ రామకృష్ణం నాయుడు, భూపతిలతో ఎంఎల్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కురబలకోట, అక్టోబరు 25: మండలంలో నూతన యూటీఎఫ్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా మునిరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యవర్గసభ్యులుగా శివశంకర్, శివయ్య, గణేష్, రఫీ, రమేష్‌నాయక్, అక్కులప్ప, రవి, శ్రీదేవీ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన నూతన కార్యవర్గానికి పలువురు అభినందించారు.

విద్యుదాఘాతంతో ఈవీ ద్విచక్రవాహనం దగ్ధం

మదనపల్లె టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైంది. మదనపల్లె పట్టణ శివారులోని దేవ తానగర్ వద్ద సుబ్రమణ్యం తన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాన్ని ఇంటి వరండాల్లో నిలిపాడు. గురువారం రాత్రి 11.30గం టల సమయంలో ద్విచక్రవాహనంలో బ్యాటరీ షార్టు సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసాయి. గమనించిన సుబ్రమణ్యం అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధం కాగా, రూ.1.50 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

మదనపల్లె టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం టీఎస్ఆర్ కాలనీలో రోడ్డు ఆక్రమణపై గ్రామస్థులు ఎంపీడీవో మస్తాన్‌వలికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్ఆర్ కాలనీలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ముగ్గురు వ్యక్తులు రోడ్డును ఆక్రమించుకుని గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనిపై విచారించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.



సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

కలకడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):జాతీయ వ్యాధి నిరోధక సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీఐవో ఉషశ్రీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆమె ఎర్రకోటపల్లె ఆసుపత్రిలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రణాళికల తయారీ, లబ్ధిదారుల సర్వే, కొవిడ్ అనంతరం టీకాల జాబితాలో చేర్చిన వ్యాక్సిన్‌ల గురించి ఆరోగ్య సిబ్బందికి వివరించారు. అనంతరం ఆసుపత్రిలోని కాన్పుల గది, ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు, సీహెచ్‌వో నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

25ఎంపీఎల్ టీ5: బ్యాంకు మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం ఆంజినేయులు

ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన కల్పించండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించాలని ఎల్‌డీఎం ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎల్‌డీఎం మాట్లాడుతూ మహిళలకు రూ.10లక్షల రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రుణాలు ఇస్తోందన్నారు. బ్యాంకులు వారికి కేటాయించిన రుణలక్ష్యాలను చేరుకోవాలన్నారు. అన్ని బ్యాంకులు కిసాన్ కా ర్డులు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి, పశుసంవర్ధకశాఖ డీడీ సత్యనారాయణ, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి శంకరప్ప, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

మదనపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభమవుతుందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మదనపల్లె పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగే సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు.

పెద్దమండ్యంలో:మండలంలో శనివారం నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయనున్నట్లు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఆదేశాలు మేరకు టీడీపీ సభ్యత్వంకు శ్రీకారం చేస్తామన్నారు.



నైపుణ్యాలను పెంచుకోవాలి


మదనపల్లె టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యార్థులు సెమినార్లలో పాల్గొంటు వారిలోని నైపుణ్యాలను తీర్చిదిద్దుకోవాలని లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత జితేంద్ర తివారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తివారి మాట్లాడుతూ కళాశాలల్లో నిర్వహించే సెమినార్లలో విద్యార్థులు ప్రతి అంశాలను గ్రహించాలన్నారు. కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు, ప్రయోగశాలల్లో నేర్చుకున్న అంశాలను సెమినార్లలో ఇచ్చే ఉపన్యాసాలను భేరీజు వేసుకుని ఇంజినీరింగ్ విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పశుగణన ప్రారంభం

తంబళ్లపల్లె అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి) : పశుగణనను పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర . శుక్రవారం తంబళ్లపల్లె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ప్రతి రోజు 20 ఇళ్లను సందర్శించి పశువులు, మేకలు, కోళ్లు, పెంపుడు జంతువులు ఉంటే వాటి పూర్తి వివరాలను నివేదికలో పొందుపర్చాలన్నారు. అనంతరం పశుగణన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, పశువైద్యరాలు సుజనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో: పశు సంవర్ధక కార్యక్రమాల కోసం పశు గణన ప్రామాణికంగా ఉంటుందని ఆ శాఖ కలికిరి ప్రాంతీయ వైద్యశాల ఏడీ వెంకటముని నాయుడు పేర్కొన్నారు. మండలంలోని మర్రికుంటపల్లె, గుండ్లూరు పంచాయతీల్లో శుక్రవారం 21వ పశు గణన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటమునినాయుడు మాట్లాడుతూ పశు సంపద స్థాయిని గుర్తించడానికి ఖచ్చితమైన విధానాల ద్వారా పశు గణన జరుగుతుందని చెప్పారు. ఫిబ్రవరి 28 వరకూ అంటే నాలుగు నెలలపాటు ప్రతి ఇంటికీ తిరిగి పశు సంపద గురించి వివరాలు సేకరిస్తామన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, ఏనుగులు, కోళ్ళు, పెంపుడు జంతువుల వివరాలను నమోదు చేయిస్తామన్నారు.



గ్రామసభలో 60 అర్జీలు స్వీకరణ

పీలేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ ఎంసీ పాళెంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో అధికారులకు 60 అర్జీలు అందాయి. వాటిలో విస్తీర్ణ సవరణ కోసం 39, జాయింట్ ఫీల్డ్ డివిజన్ కోసం 11, ఎక్కువగా ఉన్న విస్తీర్ణ సవరణ కోసం ఒకటి, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్ కోసం ఒకటి, మ్యుటేషన్ కరెక్షన్ కోసం మూడు, కోరిలేషన్ సవరణ కోసం రెండు, ఫొటో, మొబైల్ నెంబరు, పట్టాదారు సవరణ కోసం మూడు అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శులు ఫరూఖ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వారపుసంతలో రీసర్వే ద్వారా పట్టాదారు పాసు పుస్తకాలలో జరిగిన అవకతకలపై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు సంబందించిన పట్టాదారు పాసుపుస్తకాలలో ఉన్న సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం 104 అర్జీలు వచ్చాయని వాటిని త్వరలోనే సరిచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్‌ప్రసాద్ సిబ్బంది సిరాజ్ వీఆర్‌వోలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో :భూముల రీసర్వేలో తప్పులు, వెబ్‌లాండ్ లో జరిగిన అవకతవలపై ఆయా గ్రామాల్లో సంబందిత రైతుల నుంచి అభ్యంతరాలను అర్జీల ద్వారా స్వీకరించి పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలను ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని టి.సదుం పంచాయతీ అనంతాపురం, తుమ్మరకుంట పంచాయతీ చిన్నపొంగుపల్లె గ్రామాల్లో తహసీల్దార్ శ్రీరాములునాయక్ ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించగా పలువురు రైతులు తమ భూముల్లో యాజమానుల పేర్లు, ఆర్‌వోఆర్ రికార్డులుప్రకారం వేరొకరి పేర్లు ఉన్నాయని అర్జీలను రెవెన్యూ అదికారులకు అందజేశారు. ముందుగా టి.సదుం పంచాయతీ అనంతాపురంలో వీఆర్‌వో అమరనారాయణ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో వివిధ సమస్యలపై 24 అర్జీలను రైతులు అధికారులకు అందజేశారు. అనంతరం తుమ్మరకుంట గ్రామం చిన్నపొంగుపల్లె లో రైతుల నుంచి 19 అర్జీలు అందినట్లు వీఆర్వో సలీంబాష తెలిపారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ ధనంజయులు, మండల సర్వేయర్ శ్రీవాణి గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

వాల్మీకిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని శివపురం గ్రామంలో సీతారామలక్ష్మణ, హనుమ సమేత విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం విశేష భక్తజనం నడుమ సీతారామలక్ష్మణ, హనుమంతుడి విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. ఈసందర్భంగా నూతన ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండలంలోని పెద్దకురప్పల్లి పంచాయతీ తప్పసానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. మదనపల్లె నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాగయ్య తప్పసానిపల్లెకి విచ్చేసి పూజలు చేశారు. ఆలయ స్థల దాతలు గౌనివారి భరత్ రెడ్డి, ప్రతీప్‌రెడ్డిలకు ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్ అక్టోబరు24: (ఆంధ్రజ్యోతి) స్థా నిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆల యకమిటీచే విశేషపూజలు నిర్వహించారు. ఉద యాన్నే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కోల్పి ప్రత్యేకంగా అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని చీర, జాకెట్లు, పసుపు, కుంకుమలతో పొంగళ్లు నైవే. ద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్న రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మా ర్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రేజరర్లు రాటకొండ రంగస్వామి నాయుడు, కరుణాకర్ నాయుడు, సభ్యులు దేవేంద్ర, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షించారు.

బాలికలతో అసభ్య ప్రవర్తన?

- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్

పీలేరు, అక్టోబరు 25: పీలేరు ఆర్టీసీ బస్టాండులో బాలికలతో గుర్తు తెలియని వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడన్న సమాచారం శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. అందులో తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లాకు చెందిన 6వ తరగతి విద్యార్థినులు హిందూపురంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. మార్గమధ్యంలో గురువారం రాత్రి 10.15 గంటలకు ఆ బస్సు పీలేరు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంది. బస్టాండు ప్రాంగణంలోని మరుగుదొడ్లలో మూత్ర విసర్జన కోసం కొందరు బాలికలు వెళ్లగా, అక్కడే ఉన్న 40-50 ఏళ్ల మధ్య వయస్సున్న ఓ ఆగంతకుడు ఉన్నపళంగా తన దుస్తులు విప్పేసి తన శరీర అంగాలను బాలికలకు చూపిస్తూ వెకిలిగా, అసభ్యంగా ప్రవర్తించాడు. భయపడిపోయిన బాలికలు గట్టిగా కేకలు వేయగా, పక్క బాత్రూములోనే ఉన్న వారి ఉపాధ్యాయుడు బయటకు వచ్చి బాలికలను తీసుకెళ్లి బస్సులోని ఇతరులకు అప్పగించి తిరిగిరాగా అప్పటికే ఆగంతకుడు పారిపోయాడు. ఆ సమయంలో ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆర్టీసీ అధికారులు ఎవరూ లేకపోవడంతో వారు బస్సులో హిందూపురం వెళ్లిపోయారు. ఈ విషయం శుక్రవారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో పోలీసులు బస్టాండ్ వద్దకు చేరుకుని గురువారం రాత్రి మరుగుదొడ్ల వద్ద విధులు నిర్వహించిన వారి గురించి వాకబు చేశారు. దీనిపై పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారానే తమకూ తెలిసిందన్నారు. అయితే బస్టాండ్‌లో మతిస్థిమితంలేని 50ఏళ్ల వ్యక్తి తిరుగుతున్నాడని అతనే విద్యార్థినులకు కనిపించి ఉంటాడని తెలిసిందన్నారు.